JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 11-07-2026
Medchal - Malkajgiri | Saturday 11-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 40
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 | Issue 40 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com



# మెల్‌బోర్న్‌లో ప్రధాని మోదీ క్రికెట్ దౌత్యం

- స్టీవ్ వాకు 20 ఏళ్ల నాటి అరుదైన కానుక..!




జయభేరి, న్యూఢిల్లీ, జూలై 10 :

ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ క్రికెట్ దౌత్యంతో ఇరు దేశాల బంధాన్ని మరింత బలోపేతం చేశారు. తన మూడు రోజుల పర్యటనలో చివరి రోజైన శుక్రవారం (జూలై 10), ప్రధాని మోదీ ప్రతిష్టాత్మక మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (MCG)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం స్టీవ్ వాకు ఒక అపురూపమైన, అరుదైన బహుమతిని అందజేశారు. సుమారు 20 ఏళ్ల క్రితం మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్టీవ్ వా ఆయనను కలిసినప్పటి ఒక పాత ఫోటోను ప్రధాని ఈ సందర్భంగా బహుమతిగా ఇచ్చారు.




# కొత్త పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

- ఏపీ కేబినెట్ కీలక భేటీ..
- అమరావతి రైతులపై ఫోకస్..

జయభేరి, అమరావతి :

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నేడు (జులై 10) రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ సమావేశం వాస్తవానికి జులై 8న జరగాల్సి ఉండగా, కొన్ని పరిపాలనాపరమైన ఏర్పాట్ల కారణంగా నేటి వాయిదా పడింది. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఉదయం 10:30 గంటలకు ఈ భేటీ ప్రారంభం అవుతుంది.




# రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే మా ఆశయం

*వ్యవసాయం దండగ కాదు.. పండుగ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆశీర్వాద సభా వేదికగా అశేషంగా తరలివచ్చిన రైతాంగాన్ని ఉద్దేశించి చెప్పారు. గడిచిన 9 రోజుల్లో రూ. 9,000 కోట్ల మేరకు 73.30 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా చెల్లించిన సందర్భంగా ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో రైతు ఆశీర్వాద సభ నిర్వహించారు. సభా వేదికగా రైతు భరోసా చివరి విడతగా 1.44 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 1009.15 కోట్ల నిధులను విడుదల చేయడంతో పాటు రైతులకు ఈ-పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేసే కార్యక్రమానికి ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు.*

- 30 నెలల్లో 1 లక్ష 70 వేల కోట్ల రూపాయలు వ్యవసాయ రంగం పై ఖర్చు
- రైతు ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి రేవంత్

జయభేరి, ఖమ్మం :

రాష్ట్రంలోని రైతుల కళ్లల్లో ఆనందమే ప్రజా ప్రభుత్వానికి ఆశీర్వాదమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. వ్యవసాయం దండగ కాదు.. పండుగ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆశీర్వాద సభా వేదికగా అశేషంగా తరలివచ్చిన రైతాంగాన్ని ఉద్దేశించి చెప్పారు. శుక్రవారం చింకాని మండలం జగన్నాధపురం లో జరిగిన రైతు ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి పాల్గోన్నారు. వానాకాలం సీజ్ రైతు భరోసా తుది విడత నిధులు విడుదల చేసారు. భూములకు సంభంధించి ఈ పట్టాదార్ పాస్ బుక్స్ జారీ చేసారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రైతులకు వ్యవసాయం పండుగ చేయాలని, రైతును రాజును చేయాలన్న ఆలోచనతోనే గడిచిన 30 నెలల్లో 1 లక్ష 70 వేల కోట్ల రూపాయలు వ్యవసాయ రంగంపై ఖర్చు చేశామని చెప్పారు. రైతు భరోసా కింద గత ఏడాది జూన్లో 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేశామని గుర్తు చేశారు. 30 నెలల్లో రైతు భరోసా కింద 36,135 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుండదని పెద్దలు చెప్పారని, రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే మా ఆశయమని అన్నారు. రైతు భరోసా, రుణ మాఫీ, బీమా, గిట్టుబాటు ధరలు, సన్నవడ్లకు బోనస్, ఉచిత కరెంట్, నష్టపరిహారం.. ఇలా రైతు సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం గడిచిన 30 నెలల్లో 1.70 లక్షల కోట్లు ఖర్చు చేసిందని వివరించారు.

# మళ్లీ అకౌంట్లోకి డబ్బులు

- తెలంగాణ రైతులకు భారీ గుడ్ న్యూస్
- మొత్తం రూ.9 వేల కోట్లు పంపిణీ




జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రైతులకు భారీ గుడ్ న్యూస్. రైతు భరోసా చివరి విడత సాయం శుక్రవారం లబ్ధిదారులైన రైతు ఖాతాల్లో జమ కానుంది. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిధులను విడుదల చేయనున్నారు. మొత్తం రూ.1,009 కోట్లను రైతుల ఖాతాల్లో వేయనున్నారు.

# మెరిట్ లిస్ట్ వచ్చేసింది

- తెలంగాణ ANM అభ్యర్థులకు కీలక అప్డేట్




జయభేరి, హైదరాబాద్, జులై 10:

తెలంగాణ మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ANM) పోస్టుల తొలి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదలైంది. మొత్తం 1,931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టుల భర్తీకి సంబంధించి తొలి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (MHSRB) శుక్రవారం విడుదల చేసింది. మే 14న అభ్యర్థులు పరీక్షలో పొందిన మార్కులు, కాంట్రాక్ట్/అవుట్‌సోర్సింగ్ సేవలకు సంబంధించిన వెయిటేజ్ మార్కులతో కూడిన ప్రొవిజనల్ జాబితాను విడుదల చేసి, మే 18 నుంచి మే 22, 2026 వరకు అభ్యంతరాలను స్వీకరించారు. ఈ అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కరించిన బోర్డు.

# సుప్రీంకోర్టులో కలకలం!




- జడ్జీలపైకి ఫైళ్లు విసిరి, బూతులు తిట్టిన పిటీషనర్..
- బయటకు గెంటేసిన సెక్యూరిటీ!

జయభేరి, న్యూఢిల్లీ, జూలై 10 :

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఊహించని విధంగా తీవ్ర గందరగోళం, డ్రామా చోటుచేసుకుంది. అలహాబాద్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన ఒక పిటిషన్ విచారణ సందర్భంగా.. స్వయంగా వాదనలు వినిపించడానికి లిటిగెంట్ ఇన్‌పర్సన్ గావచ్చిన ఒక వ్యక్తి కోర్టు హాల్లో వీరంగం సృష్టించాడు. న్యాయమూర్తులపైకి కేసు ఫైళ్లను విసిరేయడమే కాకుండా, బహిరంగ కోర్టులోనే జడ్జీలను ఉద్దేశించి తీవ్రమైన బూతులు తిడుతూ రెచ్చిపోయాడు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి అతడిని కోర్టు హాలు నుంచి బలవంతంగా బయటకు లాగేశారు. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఎదుట ఈ వింత పరిణామం వెలుగుచూసింది. కోర్టు విచారణ ప్రారంభం కాగానే, ప్రబల్ ప్రతాప్ అనే సదరు పిటిషనర్ కనీస చట్టపరమైన వాదనలు వినిపించకుండా అత్యంత దూకుడుగా

...మిగతాది 2 లో



# మూసీ సమీపంలో ఎగిసిపడుతున్న మంటలు

- రంగంలోకి ఫైర్ ఇంజన్లు!

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ మహానగరంలో శుక్రవారం (జూలై 10) ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. చాదర్‌ఘాట్ మూసీ నది సమీపంలో ఉన్న ఒక డెకరేషన్ వస్తువుల గోదాంలో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. గోదాంలో ఈవెంట్లు, ఫంక్షన్లకు ఉపయోగించే ప్లాస్టిక్, థర్మాకోల్, బట్టలు, రసాయనాలతో కూడిన సులభంగా అంటుకునే డెకరేషన్ వస్తువులు భారీగా నిల్వ ఉంచారు. దీంతో క్షణాల వ్యవధిలోనే మంటలు గోదాం అంతటా విస్తరించి ఉగ్రరూపం దాల్చాయి. ప్రమాద తీవ్రత కారణంగా దట్టమైన నల్లటి పొగతో పాటు మంటలు ఆకాశమంత ఎత్తున పైకి ఎగిసిపడ్డాయి. చుట్టుపక్కల ప్రాంతాలకు పొగ వ్యాపించడంతో స్థానిక నివాసితులు తీవ్ర ఊపిరాడక ఇబ్బంది పడ్డారు. మంటలు వేగంగా వ్యాపించడంతో భయాందోళనలతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. స్థానికుల సమాచారం మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో గోదాం చుట్టుపక్కల ప్రాంతాలను పోలీసులు అప్రమత్తం చేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది పలు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించాయి. లోపల ఎవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో తనిఖీలు చేస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలు, జరిగిన ఆస్తి నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

నేతలు మాట్లాడితే తప్పులేదు
కానీ జర్నలిస్టులు రాత రాస్తే తప్పు...!?
2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే మా ఆశయం

సగటున ప్రతి నెలా రూ. 5,500కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటికి రాష్ట్రం రూ. 8.11 లక్షల కోట్ల మేరకు అప్పులు ఉండగా, ఎంతో సమయస్ఫూర్తితో రాష్ట్రాన్ని నడిపిస్తూ గత ప్రభుత్వ పథకాలతో పాటు అదనంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రజలకు ఉపయోగపడే పథకాలన్నీ కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను ఉదహరించారు. ఎకరాకు రూ. 12 వేలకు పెంచి రైతు భరోసా అందిస్తున్నామన్నారు. 30 నెలల్లో రూ. 80 వేల కోట్ల మేరకు వడ్లను కొనుగోలు చేశామన్నారు. గత ప్రభుత్వ పథకాలతో పాటు అర్హులైన ప్రతి పేదవారికి రేషన్ కార్డులు జారీ, సన్నబియ్యం పంపిణీ, 7 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం, మహిళా సంఘాలకు వెయ్యి బస్సులు అందించడం, బ్యాంకుల లింకేజీతో 60 వేల కోట్ల మేరకు రుణాలు అందించడం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు పండుగ సారెగా ఇందిరమ్మ చీరలు అందించడంతో పాటు ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోగా 67,717 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి అనేక అంశాలను వివరించారు. వచ్చే శాసనసభ ఎన్నికల 2029 మే, జూన్ లో జరుగుతాయని అంచనా వేసిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో లోక్సభ స్థానాలు 17 నుంచి 26కు, శాసనసభ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకిటి శ్రీహరితో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టులో కలకలం!

మాట్లాడటం ప్రారంభించాడు. మిస్టర్ జ్యుడీషియల్ సర్వెంట్.. ఉత్తరప్రదేశ్ లక్నో ఏసీపీపై, డూప్లెక్స్ టెక్నాలజీస్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను మిమ్మల్ని ఆదేశిస్తున్నాను. ఎందుకంటే నేను సార్వభౌముడిని " అంటూ జడ్జీలకే హుకుం జారీ చేశాడు.పిటిషనర్ ప్రవర్తనకు ధర్మాసనం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైంది. నువ్వు మమ్మల్ని ఆదేశిస్తున్నావా? అని జస్టిస్ విశ్వనాథన్ ప్రశ్నించారు. దానికి సదరు వ్యక్తి.. నా వైపు నుంచి చెప్పాల్సింది అంతే, అంతా రికార్డుల్లో ఉంది అంటూ తన చేతిలోని కేసు ఫైళ్ల కట్టను గాల్లోకి విసిరేశాడు. ఆ కాగితాలన్నీ కోర్టు హాల్లో జడ్జీల మీదుగా చెల్లాచెదురుగా పడిపోయాయి. అంతటితో ఆగకుండా, భారత ప్రధాన న్యాయమూర్తిని ఉద్దేశించి కూడా నోటికొచ్చినట్లు అసభ్య పదజాలంతో దూషించడం ప్రారంభించాడు.

**బలవంతంగా ఈడ్చేసిన సెక్యూరిటీ..**

కోర్టు హాల్లో పరిస్థితి అదుపు తప్పుతుండటంతో అక్కడ ఉన్న సుప్రీంకోర్టు భద్రతా సిబ్బంది వెనువెంటనే స్పందించారు. జడ్జీలపైకి దూసుకుపోకుండా అతడిని గట్టిగా పట్టుకుని, నియంత్రించి.. కోర్టు గది నుండి వెలుపలికి నెట్టేశారు. కోర్టు హాల్లో ఉన్న న్యాయవాదులు, ఇతర లిటిగెంట్లు ఈ హఠాత్పరిణామాన్ని చూసి షాక్‌కు గురయ్యారు.సాధారణంగా కోర్టు ధిక్కరణ లేదా న్యాయమూర్తులపై దాడికి ప్రయత్నిస్తే కఠినమైన జైలు శిక్షలు విధిస్తారు. అయితే, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సదరు వ్యక్తిపై ఎలాంటి కఠిన చర్యలకు లేదా కోర్టు ధిక్కరణ చర్యలకు నిరాకరించి పెద్ద మనసు చాటుకుంది. అతడిపై మేం ఎలాంటి చర్యలు తీసుకోవాలని అనుకోవడం లేదు. ఆ పిటిషనర్ పట్ల మాకు కేవలం సానుభూతి మాత్రమే ఉంది అని జస్టిస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. అనంతరం కేసు రికార్డులను పరిశీలించి, హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి సరైన కారణాలు లేవంటూ సదరు స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

## మళ్లీ అకౌంట్లోకి డబ్బులు

9 నుంచి 54 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు నగదు అందనుంది. వీటితో కలిపి మొత్తం రూ.8759 కోట్లను రైతులకు అందించినట్లు అవుతుంది. ఈ సారి 74 లక్షల రైతులకు సంబంధించిన 1.45 కోట్ల ఎకరాలకు పెట్టుబడి సాయం అందించారు. ఇక సాంకేతిక కారణాలు, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలో నిధులు విడుదల చేయనున్నట్లు రేవంత్ సర్కార్ వెల్లడించింది.

**మొత్తం రూ.9 వేల కోట్లు పంపిణీ**

గత నెల 30వ తేదీన హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో రైతు భరోసా తొలి విడత సాయాన్ని సీఎం రేవంత్ తన చేతుల మీదుగా విడుదల చేశారు. తొలి రోజు రెండు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు రూ.878 కోట్లు అందిదంచారు. అనంతరం ఆపైన భూమి ఉన్న రైతులకు విడతల వారీగా అందిస్తూ వస్తుండగా.. బుధవారం వరకు మొత్తం రూ.7750 కోట్లు రైతుల ఖాతాల్లో విడుదల చేశారు. మొత్తం రూ.9 వేల కోట్లను రైతు భరోసా కింద జమ చేశారు. దేశంలోనే ఇదే రికార్డు అని, 9 రోజుల్లోనే రైతులందరికీ అందించామని ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం వానాకాలం సీజన్ మొదలుకావడంతో రైతులు పంటలు వేస్తున్నారు. దీంతో వారికి పెట్టుబడి సాయంగా ప్రభుత్వం వీటిని విడుదల చేసింది.

**రైతు భరోసా స్టేటస్ చెక్ చేసుకోవడం ఎలా..?**

https://rythubharosa.telangana.gov.in పోర్టల్‌లోకి వెళ్లండి. హోమ్ పేజీలో లాగిన్‌పై క్లిక్ చేయండి. లబ్దిదారుడి పేరు, పాస్ వర్డ్ ఎంటర్ చేసి క్యాప్చా పూరించండి. పాస్ వర్డ్ వివరాలు లేకపోతే మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అవ్వండి. లాగిన్ అయ్యాక బెనిఫిషియరీ స్టేటస్, పేమెంట్ స్టేటస్ ఆప్షన్ సెలక్ట్ చేసుకోండి. ఆధార్ నెంబర్ లేదా పట్టాదారు పాస్ బుక్ నెంబర్ ఎంటర్ చేసి సబ్మిట్ బటన్ క్లిక్ చేయండి. ఆ తర్వాత మీ అకౌంట్లో డబ్బులు పడ్డాయా లేదా అనేది స్క్రీన్‌పై కనిపిస్తుంది.

## మెరిట్ లిస్ట్ వచ్చేసింది

శుక్రవారం తొలి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. నియామకాల్లో పారదర్శకత కోసం మరోసారి అభ్యంతరాలు స్వీకరించాలని బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌పై అభ్యంతరాలు ఉంటే జూలై 13 నుంచి జూలై 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు MHSRB వెబ్‌సైట్‌లో తమ లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లోనమోదు చేసుకోవచ్చని బోర్డు వెల్లడించింది. అభ్యంతరాలు ఒక్కసారి మాత్రమే నమోదు చేసే అవకాశం ఉండటంతో అభ్యర్థులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది.

## ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ

■ చేసిన ఏ.డీ.ఏ.

✍ జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల ప్రాంతంలోని సూరారం రాపల్లికోట లో గల ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీపాల్ తనిఖీ చేశారు. యూరియా ను అధిక ధరలకు అమ్ముతు, స్టాక్ రిజిస్టర్స్ బిల్ బుక్స్ కూడా సరిగ్గా మెయింటైన్ చేయకుండా, రైతులకు బిల్లులుఇవ్వని కారణంతో సాయి ఫర్టిలైజర్స్ సూరారం 2,39,000 విలువ చేసే సరుకుకు మరియు డీసీఎం ఎస్, రాపల్లికోట షాప్ సుమారు 1,47,000 విలువ చేసే సరుకులకు స్టాఫ్ సెల్ ఇవ్వడం జరిగింది. ఎలాంటి క్రయవిక్రయాలు జరుపకూడదని స్టాప్ సేల్స్ ఇవ్వడం జరిగింది... దీనికి సంబంధించి సంజాయిషీ కోరుతూ షో కాజు నోటీసు ఇవ్వవడం కూడా జరిగింది. వినాయక ఫర్టిలైజర్, సూరారం లో కూడా తనిఖీ చేసి లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసారు. దీనిలో భాగంగా సహాయ వ్యవసాయ సంచాలకులతో పాటు మండల వ్యవసాయ అధికారిని శ్రీజ మహదేవ్పూర్ వ్యవసాయ విస్తరణ అధికారులు రచన, ధర్మేందర్ మరియు రైతులు పాల్గొన్నారు.

# నేతలు మాట్లాడితే తప్పులేదు

## కానీ జర్నలిస్టులు రాత రాస్తే తప్ప...!?

- ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు సేవ చేస్తామని కాకమ్మ కథలు చెప్పిన నేతలు అమ్మనా బూతులు మాట్లాడితే తప్పు లేదా...
- ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులు ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే అది నేరం, దేశద్రోహం.!?
- జర్నలిస్టులు వాస్తవాలే రాయాలా..!?
- ఇది జరిగి ఉండొచ్చు? అలా ఎందుకు ఆ నేతలు కలిశారో తెలుసా..?
- అనే ఆలోచనలతో ఇన్వెస్టిగేషన్ జర్నలిస్టులు రాస్తే అది తప్ప...!?
- రాజకీయ నేతల అడుగులకు మడుగులొత్తే జర్నలిజం సిసలైన జర్నలిజమా...!?




✍ జయభేరి, హైదరాబాద్ :

సభ్య సమాజం సిగ్గుపడేలా ప్రజాసేవ చేస్తానని చెప్పి ప్రజల మద్దతు కూడగట్టుకోవడానికి ఆర్థిక బలాన్ని ఉపయోగించి అనేక మోసపూరితమైన వాగ్దానాలు గుమ్మరించి ఎలాగో ఒకలా అధికారాన్ని దక్కించుకొని తెల్లచొక్కా లేసి గలీజ్ మాటలు మాట్లాడేవాళ్లు, అసలైన పరిపాలన అధ్యక్షులు..? ఇక అదే మాటలను జర్నలిస్టులు ఆయా సోషల్ మీడియాలో ప్రసారం చేస్తే అది మాత్రం నేరం..! అని చెప్పే పరాన్న జీవులు జర్నలిస్టులుగా కొంతమంది చలామణి అవుతున్నారు. సరే అది వాళ్ళ బ్రతుకు దెరువు.. ఆ నాయకుడికి అక్షరం సాక్షిగా దాసోహం చేస్తూ రాసే ప్రతి మాట అతనికి కాసుల మూటగా మారుతుంది. తన కుటుంబం మూడు పూటలా తింటూ నాలుగు రాళ్లు వెనకేసుకుంటారేమో.. అంతేకానీ ఈ సమాజపు సాక్షిగా ప్రజల మనోభావాలను దెబ్బతీసే ఆ మాటలను రాసిన, కనీసం మాట్లాడిన జర్నలిస్టులకు మాత్రం బాధ్యత అవసరం చట్టబద్ధత నియమ నిబంధనలు షరతులు వర్తిస్తాయి... అనే దిశగా కొంతమంది జర్నలిస్టులే తమకు నచ్చిందే వార్తగా తమకు తెలిసిందే చరిత్రగా చెప్పుకొచ్చే వాళ్లను జర్నలిస్టులుగా కొలమానం చేయొచ్చా..? ఏమో? జర్నలిజానికి సిసలైన నిర్వచనం ఇచ్చిన సందర్భం రాజ్యాంగంలో ఉందిగా.. నాలుగవ స్తంభంగా జర్నలిజం కలిగిన స్థానాన్ని సరిగ్గా నిలుపుకుంటుందా..? ప్రభుత్వాలు వారికి వత్తాసు పలికే వాళ్లనే జర్నలిస్టులుగా కొలమానం చేస్తూ తమ కనుసనల్లో పెట్టుకుంటూ అందించే తాయిలాలు ఎవరికి తెలియంది కాదు..!?

అక్రిడేషన్ల కార్డుల జారీ విషయం నుండి ఇంటి స్థలం అలాగే అనేక లాభాలు పొందుకునే స్వార్థపూరితమైన జర్నలిస్టులను ఏం చేయాలి? నేటి సమాజంలో ఒక్కో పత్రిక ది ఒక్కో నైజంగా మారుతుంది. సిసలైన జర్నలిజంతో అడిగేస్తున్న వాళ్లు ఎంతమంది? ప్రతివాడు జర్నలిజం పేరు చెప్పుకొని శుద్ధపూస మాటలు మాట్లాడే వాళ్లే!? కానీ అక్షరం సాక్షిగా తమకు తెలిసింది చరిత్రగా కొలమానం చేసేవాళ్లు ఆర్థికంగా బలపడిన వాళ్లు ప్రభుత్వ అండ చూసుకొని సమాజంలో చలామణి అయ్యే వాళ్లే అసలైన జర్నలిస్టులా?

ఒకప్పుడు టీవీలో వార్తలు వస్తున్నాయి అంటే వినే వాళ్ళు చాలా తక్కువ మంది ఉండేవారు. కానీ ప్రసారమాధ్యమాలు పెరుగుతున్న సాంకేతిక పరి



✍ కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

జ్ఞానం గగనాన్ని తాకే విధంగా దూసుకుపోతున్న ఈ తరుణంలో జర్నలిజానికి అనేక కొత్త భాష్యాలు పుట్టుకొచ్చాయి.. సమాజానికి 4వ స్తంభం , పెన్ అంటే గన్ను, సిరా చుక్కల చప్పుడు, అక్షరం సాక్షిగా సంధించిన అక్షరాలు... ఇలా ఒక జర్నలిస్టును ఎంతైనా పొగిడే సమాజంలో అదే జర్నలిస్టు తన కళ్ల ముందు జరుగుతున్న అన్యాయాన్ని కచ్చితంగా ఎత్తి రాయగలడా? సమాజాన్ని ప్రశ్నించగలడా? ఒకవేళ ప్రభుత్వ అసమర్ధ పాలనను ప్రశ్నించాడే అనుకో.. ఇక వాడెవడు,? వాడి బలం బలహీనతలు ఏంటి? అనే విషయాలను పసిగట్టి "ఉపా" లాంటి కేసులు వేయరని గ్యారంటీ ఏమైనా ఉందా? మొన్నటికి మొన్న ఆంధ్రాలో ఇటు తెలంగాణలో జర్నలిస్టుల అరెస్టులు ప్రతిరోజు వార్తల్లో చూస్తున్నాం కదా.. ఇది చాలదా అసలైన జర్నలిస్టులు ఇంకా బతికున్నారు అని చెప్పడానికి.! చెప్పేవాళ్లు నీతులు ఎన్నైనా చెప్పొచ్చు వినేవాడు లోకువైతే చాలు అన్న సామెత స్పష్టంగా సరిపోతుంది కొంతమంది జర్నలిస్టులకి... స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉండాలి ఇవి కలిస్తేనే జర్నలిజం అని నిర్వచనం ఇచ్చే పెద్దలు... నిర్లజ్జగా ఆ స్వేచ్ఛ వెనక స్వార్థపూరితమైన లాభాపేక్ష తో జరిగే పరిపాలనను ఎందుకు ప్రశ్నించడు... కేంద్ర రాష్ట్ర నేతల అడుగులకు మడుగులొత్తుతూ, సమాజంలో తాను పెద్దమనిషిగా తాను సీనియర్ జర్నలిస్టుగా చలామణి అవడం లేదా..!? ఇదెక్కడి జర్నలిజం ఇదెక్కడి సంస్కృతి? స్వేచ్ఛ సమానత్వం కలిస్తేనే జర్నలిజం ఆరోగ్యకరంగా ఉంటుంది అని కొంతమంది పెద్దల నిర్వచనం...

**సమంజసమే.. ఆ స్వేచ్ఛ వెనుక స్వార్థం ఎంత? ఆ బాధ్యత వెనక ఎంత కుళ్ళు**

**కుతంత్రాలు నడుస్తున్నాయ? అనే విషయాలని ఎవరు ఎత్తి చూపాలి? ఎవరు ప్రజలకు చెప్పాలి? రాజ్యాంగం సాక్షిగా హక్కుల గురించి మాట్లాడే వాళ్లు తమ బాధ్యతల గురించి విధి విధానాల గురించి అదే రాజ్యాంగంలో ఉందని తెలుసుకోవడం మర్చిపోతున్నారు.. ప్రతివారు రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రజాస్వామ్యంలో ప్రజలకు సేవ చేస్తాం అంటూ కల్లబొల్లి మాటలు మాట్లాడే నేతలే తెల్లటి చొక్కాలు వేసుకున్న నేతలే... రాక్షస క్రీడను రంగరించి దమన కాండను కొనసాగిస్తుంటే దాన్ని ప్రశ్నించడం జర్నలిజం కాదా? చిరకాలం జరిగిన మోసం బలవంతుల దౌర్జన్యాలు ధనవంతుల పన్నాగాలు ఇతరేతర శక్తులు లేస్తే స్థాపించిన సామ్రాజ్యాలు నిర్మించిన కృత్రిమ చట్టాలు పరస్పరం సందర్శించిన శక్తులలో చరిత్ర పుట్టెను కదా... అన్న మహాకవి శ్రీశ్రీ సాక్షిగా ఒక వ్యక్తి మరొక వ్యక్తి ఒక జాతిని వేరొక జాతి పీడించే సాంఘిక ధర్మం ఇంకా నా? అని ఆనాడు ఓ శతాబ్దాన్ని శాసించిన కవి మహాశయుడే ప్రశ్నిస్తే జర్నలిస్టులు మాట్లాడితే తప్ప ? రాత రాస్తే నేరం....?**

**అసహాయుల హహకారాలు చరిత్రలు మూలుగుతుంటే... నేరం నాది కాదు, తప్ప నేను చేయలేదు అంటూ కాలానికి కత్తుల వంతెనను కడుతుంటే అజ్ఞానపుటంధ యుగంలో ఆకలి కేకలు ఆవేశంలో నడిపిస్తే నడిచే మనుషులు అంతా తమ ప్రయోజన స్వార్థం కోసమే కాదా... ఇతిహాసాల చీకటి కోణాన్ని కదలని దాచేస్తే దాగే అవీ సత్యాలుగా అయిపోతాయా... వాస్తవ కోణాలని, రణరంగ ప్రవాహ సిక్తాన్ని, నరజాతి పరిపాలన చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం కావడం లేదా...? ఏమున్నది చరిత్ర గర్వ కారణం, నరహంతకులే ధరాధిపతులై చరిత్రమున ప్రసిద్ధికెక్కుతుంటే.... సిగ్గు లేకుండా ఆ నేతలకే వత్తాసు పలికే జర్నలిస్టులు అని చెప్పకునే కొంతమంది... వారి గతమంతా ఒక్కసారి నెమరు వేస్తే మాయలతో, అంత తమ ప్రయోజనం కోసం తామే ఆస్తులు కూడా కట్టుకోలేదా వారే జర్నలిస్టులమని లిఖించుకోలేద...!? ప్రజాస్వామ్యంలో నేతలుగా వాగ్దానాలు చేసి వెరసి ప్రజలని మభ్యపెడుతూ మాయ మాటలు నీటి మూటల వాగ్దానాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్న ఆ నేతలే, నోరు జారి గలీజ్ మాటలు మాట్లాడుతుంటే దాన్ని ఎవ్వరూ ప్రశ్నించకూడదా..? జర్నలిజానికి కొత్త భాష్యాలు నూరిపోసే ఆ నేతలు ఒక్కసారి శ్రీశ్రీ మహాప్రస్థానం చదివితే కాస్తనన్న ఆలోచన విధానం మారుతుందేమో.... మనది ఒక బ్రతుకేనా అని ప్రశ్నించిన ఆ మహాకవి సాక్షిగా ప్రతి జర్నలిస్టు ఉన్నది ఉన్నట్టు నిర్లజ్జగా నిక్కచ్చిగా ప్రశ్నించగలిగినాడు ప్రజాస్వామ్యంలో కచ్చితంగా జర్నలిజం నాలుగోవ స్తంభంగా నిలబడుతుంది. అంతేకానీ ఎవరికి తగ్గట్టుగా వాళ్లు జర్నలిజం అంటే ఇది జర్నలిజం అంటే అది వ్యక్తిగత అభిప్రాయం జర్నలిజం కాదు, అని చెప్పే సోకాల్డ్ జర్నలిస్టులు, అది మీ అవివేకం కాదా..?**

ఇకనైనా మారాలి... జర్నలిజం విలువలు పోకడలు దిగజారిపోతున్న ఈ సమాజంలో ఖచ్చితంగా ప్రతి జర్నలిస్టు ఆలోచనాత్మకమైన కథనాలు రాయాలి.. అవి సమాజానికి ఉపయోగపడాలి.. అంతేకానీ నాయకుల కాళ్లకు మడుగులొత్తే ఆ జర్నలిజం దేనికి పనికిరాదు... చరిత్రను తిరగరాసే దూర్తులు సంచరించిన ధరిత్రిలో అసత్యం సత్యమై, సత్యము అసత్యమై, ప్రజల మానప్రాణాలను బలిపెట్టడం ఖాయం... ప్రతి జర్నలిస్టు సమాజపు పోకడను అర్థం చేసుకొని నాటి సమాజం తీరును, నాటి ఆర్థిక వ్యవస్థను నాటి రాజకీయ పరిపాలక దిగ్గజాల చరిత్రను ఒక్కసారి ఈనాటి తరానికి అందించే ప్రయత్నం చేయాలి.. ప్రభుత్వ తీరు తెన్నులను, సంక్షేమ అభివృద్ధి పథకాలలో జరుగుతున్న అవినీతిని ఆ నేతల లాభపూరితమైన లోప భూయిష్టమైన పనులను ఎక్కడికక్కడ నిలదీస్తూ.. కడిగేసే జర్నలిస్టులు బయటికి రావాలి... వాళ్లు మన ముఖ్యమంత్రి ఆయన మన దేశ ప్రధాని అలాంటి వాళ్లను ఇలా మాట్లాడొచ్చా..? అనేవారికి ఒకటే మాట అంత ఉన్నత స్థానంలో ఉండి ఇంత నీచమైన పనులు చేయొచ్చా అనే ప్రశ్న కూడా వెంటనే ఉత్పన్నమవుతుందని ఆలోచించాలి! ఈనాడు,జర్నలిజం ఏనాడో కాసులకు అమ్ముడుపోయింది... నవీన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకి పెరిగిపోతున్న ప్రశ్నించే ప్రతి వాడు జర్న లిస్టే... అవినీతిని అక్రమాలని దోపిడిని నేతల స్వార్థపూరితమైన పనులను నిలదీసే వాడు కచ్చితంగా జర్నలిస్టే.... అందుకే ప్రజలే ప్రజాస్వామ్యంలో ప్రభువులు... అంతిమ నిర్ణయం, అంతిమ విజయం ప్రజాస్వామ్యంలో ప్రజలదే... వారి బాగును కోరుతూ రాసే అక్షరమే జర్నలిజం....

## కొత్త పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

ఈ సమావేశంలో ప్రధానంగా రాజధాని అమరావతి అభివృద్ధి, భూసమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కలిగించే అంశాలు, పారిశ్రామిక పెట్టుబడులు, కీలక సంస్థలకు భూ కేటాయింపులపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. వైసీపీ పాలనా కాలంలో అమరావతి అభివృద్ధి పనులు మందగించడంతో.. కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. రైతుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇస్తోంది. ల్యాండ్ పూలింగ్ కోసం భూములు ఇచ్చిన రైతుల భవిష్యత్తుకు భరోసా కల్పించడం ద్వారా, మిగతా ప్రాజెక్టులకు కూడా సానుకూల వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఐతే.. ఇటీవల అమరావతిలో కొందరు రైతులు.. మాజీ సీఎం జగన్‌ని కలవడం కలకలం రేపింది. వైసీపీ పాలనా కాలంలో జగన్ అమరావతికి అనుకూలంగా వ్యవహరించలేదు. అలాంటి ఆయన్ని రైతులు కలవడం.. కూటమి ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. అందుకే ఇవాళ్టి కేబినెట్ సమావేశంలో అమరావతి రైతుల పైనే ఎక్కువ ఫోకస్ ఉండబోతోంది. రాజధాని నిర్మాణం కోసం తమ విలువైన భూములను త్యాగం చేసిన రైతులకు అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా నిశ్చయించుకుంది. ఈ కేబినెట్ సమావేశంలో రైతులకు సంబంధించి కొన్ని ప్రతిపాదనలను ఆమోదించనుంది. తాజా రిపోర్టుల ప్రకారం, కొత్తగా ల్యాండ్ పూలింగ్ విధానంలో చేరే రైతులకు ప్రతి ఏడాదికీ ఎకరాకి రూ.40 వేల చొప్పున.. మెట్ట భూములకూ లేదా నాన్ జరీబు భూములకు వార్షిక కౌలు (యాన్యుటీ) చెల్లించే ప్రతిపాదనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. అదేవిధంగా, నీటి పారుదల ఉన్న జరీబు భూములకు ఎకరాకు రూ.60,000 కౌలును పదేళ్ల పాటు చెల్లించే ప్రతిపాదనలు ఆమోదం పొందనున్నాయని ఆంధ్రజ్యోతి రిపోర్ట్ చేసింది. దీనితో పాటుగా, రాజధాని ప్రాంతంలో ట్రంక్ రోడ్ల నిర్మాణం కోసం నివాస ప్రాంతాల్లో ఇళ్లు, భూములు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం భారీ ఊరటను కలిగించనుంది. వారికి ప్రత్యామ్నాయంగా కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు నెలకు రూ.10 వేల చొప్పున అద్దె భత్యం చెల్లించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. వాస్తవానికి ఇంతకు ముందు ఈ అద్దె భత్యం నెలకు రూ.5 వేలు ఉండగా, దానిని ఇప్పుడు డబుల్ చేసి రూ.10 వేలకు పెంచబోతున్నారు.

ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, రైల్వే కారిడార్, ఇన్నర్ రింగ్ రోడ్, స్మార్ట్ ఇండస్ట్రీస్ తదితర ప్రాజెక్టుల కోసం కొత్త పూలింగ్ గ్రామాల పరిధిలో భూములు ఇచ్చిన రైతులకు సుమారు రూ.1.50 లక్షల వరకు వ్యవసాయ రుణమాఫీ చేసే ప్రతిపాదనకు కూడా ఈ సమావేశంలో ఆమోదం తెలపనున్నారు. ఈ మాఫీ జనవరి 6, 2026 నాటికి ఉన్న అర్హులైన వ్యవసాయ రుణాలకు వర్తిస్తుందని అధికారిక వర్గాల సమాచారం. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసి, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇటీవల స్టేట్ ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ బోర్డు (SIPB) ఆమోదించిన 11 భారీ పారిశ్రామిక ప్రాజెక్టులకు ఈ కేబినెట్ భేటీలో ఫైనల్ ఆమోదం లభించనుంది. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి సుమారు రూ.9,076 కోట్ల భారీ పెట్టుబడులు రానున్నాయి. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే, స్థానిక నిరుద్యోగ యువతకు సుమారు 10,531 కొత్త ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. అమరావతిని ఒక గ్లోబల్ నగరంగా అభివృద్ధి చేసే క్రమంలో, ప్రఖ్యాత సంస్థలకు భూములు కేటాయించే అంశంపై కూడా కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు అవసరమైన 307 ఎకరాల ఇనాం, దేవాదాయ శాఖ భూముల బదిలీ కోసం, దేవాదాయ శాఖకు సుమారు రూ.159 కోట్ల పరిహారం చెల్లించేందుకు సీఆర్డీఏకి ప్రభుత్వం అనుమతి ఇవ్వనుంది. ప్రఖ్యాత 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' ఫౌండేషన్‌కు 7.42 ఎకరాల భూమిని, సీఐఐ (CII)కి 4 ఎకరాల భూమిని కేటాయించనున్నారు. 'ఈషా ఫౌండేషన్'కి భూమితో పాటుగా, స్థానికంగా ఒక పార్కును నిర్వహించే బాధ్యతల్ని కూడా అప్పగించనున్నారు. మత్స్య శాఖ అధ్వర్యంలో అత్యాధునిక అక్వేరియం నిర్మాణం కోసం 2 ఎకరాల భూమిని కేటాయించే ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడనుంది. చెప్పాలంటే నేటి కేబినెట్ సమావేశం రాష్ట్ర భవిష్యత్తుకు, ముఖ్యంగా రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి ఒక కీలక మలుపుగా మారనుంది. రైతుల సంక్షేమం, పారిశ్రామిక ప్రగతి, మౌలిక సదుపాయాల అభివృద్ధి అనే ప్రధాన స్తంభాలపై ఈ ప్రభుత్వ నిర్ణయాలు ఆధారపడి ఉన్నాయని స్పష్టంగా తెలుస్తోంది. ఈ నిర్ణయాలు క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో అమలైతే, అమరావతి మళ్లీ తన పాత వైభవాన్ని సంతరించుకోవడమే కాకుండా, రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది.

## మెల్‌బోర్న్‌లో ప్రధాని మోదీ క్రికెట్ దౌత్యం

రెండు దశాబ్దాల నాటి ఈ ప్రత్యేక జ్ఞాపకం ఇరు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేయగా.. ఈ అరుదైన కానుక పట్ల స్టీవ్ వా తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ పర్యటన వేళ క్రీడా రంగంలో ఒక చారిత్రాత్మక ప్రకటన వెలువడింది. ఆస్ట్రేలియా బిగ్ బాష్ లీగ్ (BBL) 202627 సీజన్ ఆరంభ మ్యాచ్ ఈ ఏడాది డిసెంబర్‌లో భారతదేశంలోని చెన్నై వేదికగా జరగనుందని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ అధికారికంగా ప్రకటించారు. ఆస్ట్రేలియా వెలుపల ఒక అధికారిక BBL మ్యాచ్ జరగడం చరిత్రలో ఇదే తొలిసారి. భారత్ ఇంతకుముందు ఐపీఎల్ వంటి అనేక అంతర్జాతీయ లీగ్‌లకు ఆతిథ్యం ఇచ్చినప్పటికీ, ఒక విదేశీ దేశీయ క్రికెట్ లీగ్ భారత గడ్డపై అధికారిక మ్యాచ్‌ను నిర్వహించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ ప్రారంభ మ్యాచ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్లు తలపడతాయని క్రికెట్ ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. ఎంసిజి (MCG) వేదికగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ మైదానంలోకి అడుగుపెట్టడం ఏ భారతీయుడికైనా ఒకేసారి రెండు భావోద్వేగాలను కలిగిస్తుందని అన్నారు. ఒకటి భారత్‌ఆస్ట్రేలియా మ్యాచ్ ఉత్సాహం అయితే, రెండవది మన రెండు దేశాలలో క్రికెట్ కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు, అది ఒక ఉమ్మడి అభిరుచి అనే గ్రహింపు అని స్పష్టం చేశారు. ఈ రోజు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటలోని ఆనందం, ఇరు దేశాల స్నేహంలోని ఆత్మీయత మాత్రమే ఇక్కడ కనిపిస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. ఇదిలావుంటే, భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) మద్దతుతో, చెన్నై మ్యాచ్‌ను ఒకే ఒక్క ప్రత్యేక ఈవెంట్‌గా ప్లాన్ చేశారు. 2030 వరకు జియోస్టార్‌తో కుదిరిన మీడియా హక్కుల ఒప్పందం ద్వారా బిబిఎల్ ఇప్పటికే భారతదేశంలో ప్రసారం అవుతుండగా.. తాజా నిర్ణయంతో ఈ ప్రాంతం నుండి బాహ్య పెట్టుబడులను ఆకర్షించే అవకాశాన్ని కూడా క్రికెట్ ఆస్ట్రేలియా అన్వేషిస్తోంది.

# మైనర్ బాలికపై జరిగిన ఘటనను ఖండిస్తూ ఉప్పల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

- **రాజస్థాన్‌లో మైనర్ బాలిక పై జరిగిన అమానుష ఘటనను ఖండిస్తూ ఉప్పల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)**

**జయభేరి, ఉప్పల్, జూలై 10:**



రాజస్థాన్ రాష్ట్రంలోని శ్రీగంగానగర్‌లో 13 ఏళ్ల మైనర్ బాలికపై జరిగిన దారుణ సామూహిక అత్యాచారం, అక్రమ రవాణా (ట్రాఫికింగ్) ఘటన దేశాన్ని తీవ్రంగా కలచివేసిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) అన్నారు. ఈ అమానుష ఘటనకు నిరసనగా ఉప్పల్ సర్వే నుండి ఉప్పల్ రింగ్ రోడ్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద బాధిత చిన్నారి చిత్రపటానికి పూలమాల వేసి, కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. బాధితురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని మౌనం పాటిస్తూ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) మాట్లాడుతూ, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దారుణాలకు సమాజం మొత్తం ఐక్యంగా ఎదిరించాలని అన్నారు. ఇలాంటి ఘోర నేరాలకు పాల్పడిన ప్రతి నిందితుడికి చట్టప్రకారం అత్యంత కఠినమైన శిక్ష విధించి, బాధిత కుటుంబానికి త్వరితగతిన న్యాయం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అలాగే, చిన్నారుల భద్రత కోసం పాఠశాలలు, తల్లిదండ్రులు, పోలీసు శాఖ, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, మహిళలు, బాలికల రక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కొవ్వొత్తుల ర్యాలీలో ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందీప్ భూషణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డా. ఆదాల అంజయ్య, విజయ్, ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల యువజన నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాధిత బాలికకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) దేశంలో మహిళల గౌరవం, భద్రతను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.



## తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో తాగునీటి సరఫరా, నీటి ఒత్తిడి సమస్యలు, కొత్త పైప్‌లైన్‌ల ఏర్పాటు, లీకేజీల నివారణ, మురుగునీటి నిర్వహణ తదితర అంశాలపై వాటర్ వర్క్స్ సీజీఎం పంకజా IASని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా నీటి కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. అలాగే పాత పైప్‌లైన్‌ల కారణంగా తరచూ ఏర్పడుతున్న లీకేజీలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్‌ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మురుగునీటి సమస్యలు అధికంగా ఉన్న కాలనీలలో ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. సమావేశంలో అధికారులు నియోజకవర్గంలో కొనసాగుతున్న వాటర్ వర్క్స్ పనుల పురోగతిని వివరించగా, ప్రజల సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



## 15న కొత్తకోటకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక

- **ప్రభుత్వ బాలికల పాఠశాలను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి**

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రానికి ఈనెల 15న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్నారు. ఈ సందర్భంగా ఆరోజు ముఖ్యమంత్రి స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డితో కలసి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా అక్కడ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు.



# బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

- **స్థానికంగా నివాసం ఉన్న ప్రజలకు ఇబ్బందులు**

**జయభేరి, కాప్రా :**



మల్లాపూర్ డివిజన్ పాత మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ అన్నపూర్ణ కాలనీ పంచముఖ హనుమాన్ ఆలయం నుండి ఓల్డ్ మీర్పేట్ హనుమాన్ ఆలయం వరకు నిర్మించదలచిన బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే కాలనీవాసులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సరఫరా, విద్యుత్ తీగల మార్పు వంటి సమస్యలను లేవనెత్తగా మున్సిపల్, జలమండలి, విద్యుత్ అధికారులకు సమన్వయం చేస్తూ పరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ యొక్క బాక్స్ డ్రైన్ వెడల్పు నిర్మాణంతో వర్షం నీరు నిలవకుండా, స్థానికంగా నివాసం ఉన్న ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉంటారని, ఈ నిర్మాణం పూర్తయితే డ్రైనేజీ నీరు రోడ్లపైకి రాకుండా ప్రధాన సమస్య తీరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం వేణు గోపాల్, వర్క్ ఇన్స్పెక్టర్ బిక్షపతి, కాలనీ అధ్యక్షులు పాండాల నరసింహ గౌడ్, సెక్రటరీ సంజయ్ నాయక్ మరియు నాయకులు ఉల్లెం బాలరాజు, కృష్ణ, వాసు చారి, బోనాల శ్రీనివాస్, చంద్రశేఖర్ గౌడ్, రిజ్వాన్, అంజనీ ప్రసాద్, ప్రేమ్ సాగర్, స్వామి గౌడ్, శంకర్ గౌడ్, రాజలింగం, అజీజ్, కిట్టు, శేఖర్ గౌడ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి దామోదర్ రాజనర్సింహని మర్యాదపూర్వకంగా కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలోని పలు పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో బస్తీ దవాఖానల ఏర్పాటు కోసం వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో బస్తీ దవాఖానలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ దవాఖానల ద్వారా పేద ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, ప్రాథమిక చికిత్సలు, అవసరమైన మందులు సకాలంలో అందించడంతో పాటు ఆరోగ్య సేవలు మరింత చేరువ అవుతాయని ఎమ్మెల్యే వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు.

# ఘట్‌కేసర్ గురుకుల కళాశాలను సందర్శించిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్

- **ఉపాధ్యాయుల కొరతపై అధికారులతో చర్చ.. త్వరలోనే నియామకాలు చేపడతామని హామీ**

**జయభేరి, ఘట్‌కేసర్ :**



మల్కాజ్గిరి కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని ఘట్‌కేసర్ గురుకుల కళాశాలను మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఈరోజు సందర్శించారు. కళాశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, ప్రిన్సిపాల్‌తో పాటు ఘట్కేసర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి, మాజీ చైర్‌పర్సన్ మల్లి పావని జంగయ్య యాదవ్ తో సమావేశమై కళాశాల పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, ఘట్‌కేసర్ గురుకుల కళాశాల నూతన భవన నిర్మాణం కోసం తాను నియోజకవర్గ ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి నిధిగా రూ.1.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. కళాశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని ప్రిన్సిపాల్, మాజీ చైర్‌పర్సన్ పావని తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడగా, అతి త్వరలోనే అవసరమైన ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ చేపడతామని అధికారులు హామీ ఇచ్చినట్లు వజ్రేష్ యాదవ్ వెల్లడించారు. ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యా రంగ అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యాశాఖ అధికారులు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



## ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనే..

**జయభేరి, కూకట్పల్లి :**

కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.. ప్రధానంగా ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం పై ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత మనపై ఉందని.. ఎప్పటికప్పుడు బి.ఎల్.ఎ, బి.ఎల్.ఓ లకు అందుబాటులో ఉండి ఏదైనా సమస్య ఉంటే వాటిని సరి చేయాలని.. అలాగే ఓటర్ల ఎవరైనా అందుబాటులో లేనప్పుడు వారి సమాచారం సేకరించి తిరిగి మళ్లీ బి.ఎల్.ఎ..బి.ఎల్.ఓ లకు వారి సమాచారం అందించి వారి ఓటును పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని సూచించారు.. ప్రధానంగా BLO లు ఎవరైనా అందుబాటు లో లేకపోతే తిరిగి మళ్ళీ వారిని చేరుకునే ప్రయత్నం చేయడం లేదు అని... ఓటు ప్రతి ఒక్కరి పౌరుహక్కని.. ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు.. ఆఫీసర్లు ఇంటికి వచ్చినప్పుడు ఏమైనా సందేహాలు ఉంటే అక్కడికక్కడే తెలుసుకుని వారు ఇచ్చిన దరఖాస్తు నింపి ఇవ్వాలని ఇవన్నీ కూడా దగ్గరుండి చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఈ సందర్భంగా ఆయన సూచించడం జరిగింది.. ఏమైనా ఇబ్బంది ఉన్నయెడల ఎన్నికల సంఘం కు ఫిర్యాదు చేయాలని సూచించారు... ఈ కార్యక్రమంలో కూకట్పల్లి బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, కూకట్ పల్లి నియోజకవర్గం మెంబెర్ షిప్ ఇన్ ఛార్జ్ గజ్జల నగేష్, మాజీ కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబురావు, సబియా గౌసుద్దీన్, మందడి శ్రీనివాసరావు, మహేశ్వరి శ్రీహరి పాల్గొన్నారు.

## బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా యొక్క క్లైంట్ పట్లోళ్ల వెంకట రమణా రెడ్డి, S/o. పట్లోళ్ల విట్టల్ రెడ్డి, నివాసం ఇంటి నెంబర్ 8-2-293/82/A/1057/1, రోడ్ నెంబర్ 52, బంజారాహిల్స్, హైదరాబాద్ వాస్తవ్యుడు రంగారెడ్డి జిల్లాలోని ఫరూక్ నగర్ మండలం, కంసాన్ పల్లి గ్రామం, నాగూర్లగడ్డ తాండాకు చెందిన ఆంగోతు గణేష్ S/o. ఆంగోతు బాలు దగ్గర సర్వే నెంబర్లు 164/EAA/A, 170/AA/7/AA, 179/A/2/A, 181/RU/1, 185/U/1, 182/U/2, 182/1, 185/0/1, 185/LU/A, 186/EE, 186/UU, విస్తీర్ణాలు 00-08, 00-0350, 00-08, 00-02, 00-2750, 00-2550, 00-02, 00-18, 00-1250, 00-05, 00-20 మొత్తం విస్తీర్ణం ఎ 3-12 గుంటల పట్టా భూమిని అగ్రిమెంట్ ఆఫ్ సేల్ ద్వారా కొనుగోలు చేయడం జరిగినది. ఈ విషయాన్ని మరుగున పరిచి ఈ ఆంగోతు గణేష్ అనే వ్యక్తి పైన తెలిపిన వ్యవసాయ భూములను ఇతరులకు అమ్మడానికి ప్రయత్నం చేస్తున్నాడని నా క్లైంటుకు రూఢీగా తెలిసినది. అయితే పైన తెలిపిన భూములపై ఆంగోతు గణేష్ పైన షాద్నగర్ పట్టణంలోని 16వ అదనపు జిల్లా కోర్టులో పైన తెలిపిన భూములపై సివిల్ దావా వేయడం జరిగినది. అట్టి దావా నెంబర్ O.S. No. 220 of 2025, ఇది ఇప్పటికీ పెండింగ్ లో ఉన్నది. కావున పైన తెలిపిన వ్యవసాయ భూములపై ఎలాంటి అమ్మకాలు, కొనగోలు జరిపిన నా క్లైంట్ తీసుకునే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని ఈ పత్రిక ద్వారా నా క్లైంట్ తరపున బహిరంగంగా తెలియపరచనైనది.

**సం/- పాతపల్లి సురేందర్ రెడ్డి,** న్యాయవాది
షాద్నగర్. Cell : 9948698778.

## మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి**
- **5వ వార్డులో రూ.36 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన**

**జయభేరి, షాద్ నగర్ :**



పట్టణ ప్రణాళిక అభివృద్ధిలో భాగంగా షాద్‌నగర్ మున్సిపాలిటీ 5వ వార్డులోని చౌదమ్మ గుట్ట ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో రూ.36 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారంతో పాటు ఆధునిక మౌలిక వసతుల కల్పన కోసం దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మున్సిపల్ ఏఈ సాయి కిరణ్, నరేష్, కౌన్సిలర్ కొప్పినూరు ప్రవీణ్, రాజు నాయక్, మురళీమోహన్ (అప్పి), అనిల్ కుమార్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖదీర్, లతా శ్రీశైలం గౌడ్, సాదిక్, కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, రవి కుమార్ గుప్తా, సర్పంచ్ చందు నాయక్, మహబూబ్, రవితేజ, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

## భైంసా లో విషాదం...

- **బిల్డింగ్ 2వ అంతస్తు నుండి పడి 2 సంవత్సరాల పాప మృతి.**

**జయభేరి, భైంసా:**

పట్టణంలోని రాహుల్ నగర్ లో విషాదం చోటుచేసుకుంది. 2వ అంతస్తు నుండి ఆడుకుంటూ బిల్డింగ్ పై నుండి కింద పడి కీర్తి సింగ్ (2 సంవత్సరాలు) పాప మృతి చెందింది... రాజస్థాన్ నుండి భైంసా పట్టణంలోని రాహుల్ నగర్ లో అద్దె కుంటు నివాసం ఉంటున్న మాధవ్ సింగ్ ప్రియాంక దంపతుల కుమార్తె కీర్తి (రెండు సంవత్సరాలు.) బాల్కనీలో ప్రమాదవశాత్తు కింద పడి తనకు బలమైన. దెబ్బ తగలడంతో అక్కడే మృతి చెందింది.

# సాంకేతిక విద్యతో దేశాభివృద్ధికి తోడ్పడాలి

- ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి
- సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో ఘనంగా 2026 గ్రాడ్యుయేషన్ డే వేడుకలు
- ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలి: సీహెచ్ గోపాల్ రెడ్డి



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా కాండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ (సీఎంఆర్‌టీసీ)లో 2026 విద్యా సంవత్సరానికి చెందిన ఇంజనీరింగ్ పట్టభద్రుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్‌ఈ) చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పట్టభద్రులకు డిగ్రీ ధ్రువపత్రాలు అందజేశారు. ప్రత్యేక అతిథులుగా ఎంఎస్ఎంఈడీఎఫ్‌వో హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ అండ్ హెడ్ సి.ఎస్.ఎస్. రావు, కాగ్నిజెంట్ డైరెక్టర్-ఎంగేజ్‌మెంట్ డెలివరీ పార్ట్‌నర్ రఘు కులకర్ణి, కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ జితేందర్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ అనేది విద్యార్థుల జీవితంలో ఒక కీలక మైలురాయి అని, ఇది విద్యాభ్యాసం ముగింపు కాకుండా కొత్త అవకాశాలు, బాధ్యతలతో కూడిన ప్రయాణానికి నాంది అని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీ సాధించడం మాత్రమే కాకుండా, సాంకేతిక నైపుణ్యాలు, పరిశోధనా దృక్పథం, ఆవిష్కరణాత్మక ఆలోచనలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని తెలిపారు. ప్రపంచ స్థాయిలో భారత యువతకు అపార అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ దేశ సాంకేతికాభివృద్ధికి, ఆర్థిక ప్రగతికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాంకేతిక విజ్ఞానాన్ని సమాజ ప్రయోజనాలకు వినియోగిస్తూ నైతిక విలువలు, సామాజిక బాధ్యతతో కూడిన ఇంజనీర్లుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సి.ఎస్.ఎస్. రావు ,వైస్ చైర్మన్ సీహెచ్ అభినవ్ రెడ్డి, సెక్రటరీ వసంత లత, సీఎంఆర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ ఎ. రాజిరెడ్డి, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలి: సీహెచ్ గోపాల్ రెడ్డి**

సీఎంఆర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ సీహెచ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ అనేది విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి మాత్రమే కాకుండా, కొత్త బాధ్యతలకు నాంది అని అన్నారు. సీఎంఆర్‌లో విద్యను అభ్యసించిన ప్రతి విద్యార్థి సాంకేతిక నైపుణ్యాలతో పాటు మానవీయ విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించుకుని ఉత్తమ ఇంజనీర్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యం ప్రతి విద్యార్థిలో ఉందని, నిరంతర అధ్యయనం, కృషి, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. సాంకేతిక ఆవిష్కరణలు, పరిశోధనల ద్వారా సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపే దిశగా యువ ఇంజనీర్లు ముందుండాలని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సీఎంఆర్ సంస్థ ఎల్లప్పుడూ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నాణ్యమైన విద్య అందించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

---



## జనతా వారిధిలో ప్రజా సమస్యలుపై అర్జీలు అందజేసిన బీజేపీ నాయకులు

**జయభేరి, పరవాడ:**

భారతీయ జనతా పార్టీ జిల్లా కేంద్రంగా నిర్వహిస్తున్న జనతా వారిధి కార్యక్రమంలో భాగంగా ఈ రోజు పరవాడ మండల బిజెపి అధ్యక్షులు పిల్లా సతీష్ అధ్యక్షతన అనకాపల్లి పార్లమెంట్ సభ్యులకు రెండు అర్జీలు ఇవ్వడం జరిగింది. మొదటిది పెదముసిడివాడ గ్రామంలో పెరుగుతున్న జనాభాకి సరిపడు నీటి సరఫరా లేనందున ఒక వాటర్ ట్యాంకును మంజూరు చేయవలసిందిగా అదేవిధంగా రెండవది పరవాడ మండలంలో ఉన్న సముద్రతీర ప్రాంతాలైన తిక్కవానిపాలెం, ముత్యాలమ్మ పాలెం బీచ్లను పర్యాటక స్థలాలుగా అభివృద్ధి చేసి పర్యాటకులు బోటింగ్ చేసే అవకాశం కూడా కల్పించాలని, దాని ద్వారా అక్కడున్న యువతకి ఉపాధి అవకాశం కల్పించాలని జనత వారధి ద్వారా అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ను కోరారు. ఈ కార్యక్రమమునకు పరవాడ మండల ప్రధాన కార్యదర్శి బంతికొరు గోవిందరాజు,బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---

## రైతు ప్రభుత్వానికి పాలాభిషేకం

- చందుపట్ల రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్



**జయభేరి, పరకాల, జులై 10:**

9 రోజుల్లో 9000 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేసిన సందర్భంగా పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అధ్యక్షతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకి పరకాల నియోజకవర్గ శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పరకాల పట్టణ మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్,మాజీ పి ఏ సి ఎస్ చైర్మన్ కట్కూరి దేవేందర్ రెడ్డి పరకాల పట్టణ అధ్యక్షులు ఒంటేరు శ్రవణ్, వ్యవసాయ శాఖ అధికారులు ఏడిఏ, ఏఓఏఈఓ, కౌన్సిలర్స్ కొయ్యడ శ్రీనివాస్, గూడెల్లి సదన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుర్ర రాజమౌళి, మంద నాగరాజు, దావు పరమేశ్వర్, ఉడుత సంపత్, బొచ్చు భాస్కర్, లడే శ్రీకాంత్, అల్లం శ్రీరామ్, మంద వెంకటేష్, సంజీవయ్య, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

---

## యాదగిరీశుడికి ఘనంగా లక్ష పుష్పార్చన



**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 10 :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి లక్షపుష్పార్చనను వేదోక్తంగా నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం వివిధ రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను వివిధ పట్టువస్త్రాలు, బంగారు, వజ్ర వైఢూర్యాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. సుగంధ పరిమళ పుష్పాలతో లక్ష పుష్పార్చనను శ్రీపాంచ రాత్రాగమానుసారంగా నిర్వహించగా భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకొని తరించారు.

---

## పరకాలలో బంధు విజయవంతం

- బొచ్చు కళ్యాణ్, ఎస్‌ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు




**జయభేరి, పరకాల, జులై 10:**

శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ సందర్భంగా పరకాల పట్టణంలో బంధు విజయవంతం అయింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ.. బందుకు ప్రభుత్వ స్కూలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, పాలిటెక్నిక్ కళాశాల సైతం విద్యార్థులు బందుకు సహకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఎంఈఓ డిఈఓ పోస్టులను భర్తీ చేయాలని పాఠశాల ప్రారంభమై ఇప్పటివరకు యూనిఫామ్స్ పాఠ్యపుస్తకాలు రాలేదని పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ లను విడుదల చేయాలని విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ హేమంత్ ఇస్మాయిల్ పట్టణ కార్యదర్శి సాయి తేజ విక్కీ పాల్గొన్నారు.

---

# ప్రజా సమస్యలపై పరమేశ్వర్ రెడ్డి పోరాటం

- HMWSSB ఈడి పంకజని కలిసి వినతి



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గంలో త్రాగునీరు, డ్రైనేజీ సమస్యలపై ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి HMWSSB ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా లేవనెత్తిన సమస్యలు.. చిలకనగర్ మహిళా భవన్ బొడ్రాయి వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అవుట్ లైన్ వెంటనే పునరుద్ధరించాలి. బీరప్ప గడ్డ డివిజన్ శ్రీనగర్ వాటర్ పొల్యూషన్ సమస్య, కొత్త మంచినీటి పైప్ లైన్లు ఏర్పాటు. ఉప్పల్ డివిజన్ శ్రీరమణ పురం, మల్లికార్జున నగర్, అమృత కాలనీ లక్ష్మీనారాయణ కాలనీ, చర్చి కాలనీ లో తాగునీటి పైపు లైన్లు, కొత్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు వేగవంతం చేయాలి. మల్లాపూర్ వార్డ్.. ఓల్డ్ మల్లాపూర్ గ్రామం, బీరప్ప గడ్డ, చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త UGD లైన్లు వేయడం. ఓల్డ్ మల్లాపూర్ గ్రామం, బీరప్ప గడ్డ, చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త తాగునీటి లైన్లు వేయడం. ఓల్డ్ మల్లాపూర్ గ్రామం, SC కాలనీలో గాంధీ విగ్రహం నుండి కృష్ణ యాదవ్ ఇంటి వరకు కొత్త UGD లైన్లు వేయడం. మల్లాపూర్ గ్రామం, నరసింహ నగర్ కాలనీ, సాయి టవర్స్ వెనుక భాగం నుండి శ్రీనివాస్ క్లినిక్ లైన్ వరకు కొత్త UGD లైన్లు వేయడం. మల్లాపూర్ గ్రామం, B.N లత నుండి నరసింహ నగర్ కాలనీ వరకు కొత్త UGD లైన్లు వేయడం.

HB కాలనీ వార్డ్.. HB కాలనీ వార్డ్, రాజీవ్ నగర్, N.F.C గోడ పక్క లైన్లలో తాగునీటి పైప్ లైన్లు వేయడం. HB కాలనీ వార్డ్, ఇంద్ర నగర్ కాలనీలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త UGD లైన్లు వేయడం. HB కాలనీ వార్డ్, బక్షిగూడ కమ్యూనిటీ హాల్, దాని పరిధిలోని అన్ని లైన్లలో కొత్త UGD లైన్లు వేయడం. HB కాలనీ వార్డ్, మంగాపురం కాలనీలో చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త UGD లైన్లు వేయడం. పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. "ఉప్పల్ నియోజకవర్గంలో త్రాగునీరు, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ప్రజలు నీళ్లు లేక, కలుషిత నీళ్లు తాగి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలుపెట్టాలి. టెండర్ పూర్తయిన చోట పనులు వేగవంతం చేయాలి" అని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రథమ కర్తవ్యం.

---



## ఇందిరమ్మ ఇండ్లను వేగవంతంగా పూర్తి చేయాలి

- అడిషనల్ కలెక్టర్

**జయభేరి, తుర్కపల్లి, జూలై 10 :**

ఇందిరమ్మ ఇండ్లను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మాణం జరుగుతున్న అభివృద్ధి పనులను, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొమ్మాట అనురాధ బాబు, హౌసింగ్ డి ఈ శ్రీరాములు, ఏఈ నరేష్, ప్రధానోపాధ్యాయురాలు బాలమని, పంచాయతీ కార్యదర్శి ఇంజ నరేష్, వార్డు సభ్యులు, కారోబార్ దుడుక బాబు పాల్గొన్నారు.

---

# అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి
- జవహర్ నగర్ బయలుదేరిన మహిళలను అడ్డుకున్న పోలీసులు
- పలువురి నేతల అరెస్టు





**జయభేరి, షాద్ నగర్, జులై 10 :**

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు అని సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక కార్యక్రమంలో పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి భారీ సంఖ్యలో మహిళలు, రాజకీయ నాయకులతో భారీ నిరసన తెలిపారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు స్వచ్ఛందంగా వెళుతున్న భారతి జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ,వడ్డే బాలయ్య,మహేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి,శ్రీధర్, తదితర మహిళలను,రంగారెడ్డి జిల్లా కొత్తూరు పోలీసులు అడ్డుకున్నారు. మహిళలకు మద్దతుగా నిలిచిన పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి,వడ్డే బాలయ్య,మహేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి,శ్రీధర్ ను పోలీసులు అదుపులోకి తీసుకుని కొత్తూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా పోలీసులకు ఆందోళనకారులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.ఈ ఘటనతో సదరు ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ముందస్తు చర్యగా తదితరులను అదుపులోకి తీసుకున్నారు.. ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.... అరెస్టులతో పోలీసులు తమ న్యాయ పరమైన ఉద్యమాన్ని ఆపలేరు అని అన్నారు.ప్రజలకు కీడు చేసే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం మానుకుని వెన్నక్కి తగ్గాలని,ఇచ్చిన జి ఓ ఏ మాత్రం ప్రజలు మంచి చేసే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. మంచు కోసం మార్పు కోసం ప్రజా సంక్షేమం కోసం ఏర్పడ్డ ప్రభుత్వం ప్రజలకు హాని కలిగే డంపింగ్ యార్డును ఎట్టు పరిస్థితిలో సిద్ధాపూర్ లో ఏర్పాటు చేయడానికి వీలులేదని, ప్రజల నిర్ణయాన్ని మొదటగా ప్రభుత్వం విని ఉంటే బాగుంటుంది అని,సొంత నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్తుకు ముప్పు కలుగుతుంది అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి మాని డంపింగ్ యార్డ్ ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

---

## రైల్వే అండర్‌పాస్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన రైల్వే అధికారులు



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ సర్కిల్ గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ప్రతిపాదిత రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి (RUB) నిర్మాణ స్థలాన్ని శుక్రవారం రైల్వే ఉన్నతాధికారులు, బీజేపీ నాయకులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలు, రూట్ మ్యాప్‌ను పరిశీలించి, పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం బీజేపీ లక్ష్యమని తెలిపారు. ఈ అండర్‌పాస్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి నిరంతరం పర్యవేక్షిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కావేరీ శ్రీధర్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ ఉషిగారి శ్రీనివాస్ ముదిరాజ్, బీజేపీ నాయకులు జైతువాలా కిషన్, మలిగే అశోక్, బట్టికడి నవనీత్, నవీన్ కుమార్, అరుణ్, నాని, శ్రవణ్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

---

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో
# విద్యాసంస్థల బందుకు సంపూర్ణ మద్దతు



**జయభేరి, దేవరకొండ :**

రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం 23 వేల పాఠశాలలను రద్దు చేయడాని విరమించుకోవాలి. ప్రవేట్ టీచర్స్ , లెక్చరర్స్ కు ప్రత్యేక చట్టం తీసుకొచ్చి ఆదుకోవాలి. సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్. దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో 23 వేల పాఠశాలలను రద్దు చేయడం విరమించుకోవాలని, దీనివల్ల డ్రాప్ అవుట్ విద్యార్థుల సంఖ్య పెరిగి పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యేటటు వంటి అవకాశం ఏర్పడుతుంది. ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ సమస్యల ను పరిష్కరించే దిశగా ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పిఎఫ్, టీచింగ్ గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలి. ప్రైవేటు విద్యాసంస్థలో పని చేస్తున్న సిబ్బందికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యలు సాధించుకునే దిశగా ఉద్యమాలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పున్న వెంకటేష్ నేత, నటువ సుధాకర్, అప్పం వీరయ్య, ఎండి రంజాన్ బేగ్, డాక్టర్ భాషా చౌహన్, కానుగుల చంద్రశేఖర్, ముశిని వీరయ్య, పున్న బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెండోసారి అధికారంలోకి రావడం ఖాయం

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ధీమ
- కొత్తకోటలో సిడిసి చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం

జయభేరి, దేవరకద్ర :



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండోసారి అధికారంలోకి రావడం ఖాయం అని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ధీమా వ్యక్తపరిచారు.2034 వరకు అధికారంలో ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఎమ్మెల్యే అన్నారు.దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం సీడీసీ చైర్మన్ గౌని చంద్ర మోహన్ రెడ్డి ప్రమాణ స్వికారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజర య్యారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే జియంఆర్ ప్రసంగించారు. గతంలో సీడీసీ చైర్మన్ గా పని చేస్తూ, దివంగతులు అయినా పెద్దలు గొల్ల బాబన్న గారిని గుర్తుకు చేస్తూ, వారి సేవలను ఎమ్మెల్యే జిఎంఆర్ కొనియాడారు. నూతనంగా సీడీసీ చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేసిన చంద్రమోహన్ రెడ్డి.. చెరుకు రైతుల కష్ట, సుఖాలు తెలిసిన వ్యక్తి, ఖచ్చితంగా చంద్రమోహన్ రెడ్డి తను చేపట్టిన పదవికి వన్నె చేస్తారని ఆశాభావం వ్యక్తపరిచారు. సీడీసీ యజమాన్యం సామాజిక బాధ్యతగా సిఎస్ఆర్ నిధులను ఖర్చు చేయాలి, ఉపాధి కల్పనలో స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.ఈ ప్రాంతంలో కృష్ణవేణి షుగర్స్ లిమిటెడ్ సి డి సిని స్థాపించిందే కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు.ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్న సందర్భంలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా, ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థానిక నాయకులు సహకారం అందించారు, కంపెనీ యాజమాన్యం సైతం స్థానికులకు పూర్తి సహకారం అందించాలన్నారు. పదవులన్నీ బాధ్యతతో కూడుకున్నవి, కష్టపడ్డ ప్రతి ఒక్కరికి వరస క్రమంలో అవకాశాలు వస్తాయి, కష్టపడ్డ వారికి అవకాశాలు కల్పించే బాధ్యత నాది అని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.బిఆర్ఎస్ నాయకులు అధికారంలోకి రేపు వస్తాం, ఎల్లుండి వస్తాం అంటూ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు.బిఆర్ఎస్ పార్టీని మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించి పది అడుగుల లోతున పాతిపెట్టిన, ఇంకా పగటి కలలు కంటున్నారని విమర్శించారు.

20 ఏళ్ల అయినా బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదు, సచ్చేది లేదన్నారు.పదేళ్లు అధికారంలో ఉండి బిఆర్ఎస్ నాయకులు పాలమూరు రంగారెడ్డిని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి బిఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే శంకర సముద్రం ను కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని ఎమ్మెల్యే అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి చిన్న చింతకుంట లో జూనియర్ కాలేజ్, దేవరకద్రలో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయలేదు, కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రి, దేవరకద్ర లో 100 పడకల ఆస్పత్రి నిర్మించలేదు, దేవరకద్రలో కోర్టు ఏర్పాటు చేయలేదు, దేవరకద్ర నియోజకవర్గ కేంద్రాన్ని కనీసం మున్సిపాలిటీ చేయలేదని ఆరోపించారు.

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కొత్తకోట గర్ల్స్ హైస్కూల్ లో బాత్రూంలు లేకున్నా, పాఠశాల భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న, ఉన్న అంతంత మాత్రం క్లాస్ రూమ్ లలో పెచ్చులుడుతున్న గత ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే పట్టించుకోలేదన్నారు. మన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సిఎస్ ఆర్ నిధులు తీసుకువచ్చి, గర్ల్స్ హైస్కూల్ భవనాన్ని నిర్మిస్తున్నాం, వచ్చేనెల 15వ తేదీన ముఖ్యమంత్రి సమక్షంలో గర్ల్స్ హైస్కూల్ ను ప్రారంభించు కోబోతున్నామన్నారు. పేదల సొంతింటి కల నెరవేరుస్తూ ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 10 లక్షల ఆరోగ్యశ్రీ, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఇస్తున్నామన్నారు. రెండు లక్షల రుణమాఫీ చేసాం, దేశంలో ఎక్కడా లేనివిధంగా రేషన్ పై సన్న బియ్యం ఇస్తున్నాం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. సార్ పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బి ఎల్ ఏ లు అప్రమత్తంగా ఉండాలి, సర్ లో చురుగ్గా పాల్గొనాలని ఎమ్మెల్యే అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏమి చేయని హరీష్ రావు ఇప్పుడు మూడు నెలలు అంటున్నారన్నారు. హరీష్ రావు..... కవిత అన్నట్లు పదేళ్లు మీరు చేసిన అవినీతి చాలదన్నట్లు, ఇంకో మూడు నెలలు కావాలా.. అని ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రశ్నించారు. దమ్ముంటే హరీష్ రావు, కేటీఆర్ లు కవిత వ్యాఖ్యలపై స్పందించాలన్నారు. హరీష్ రావు, కేటీఆర్ మీరు ఎన్ని వేషాలేసినా, యూట్యూబ్ ఛానల్ లు పెట్టుకుని ఎంత దుష్ప్రచారం చేసిన ప్రజలు మిమ్మల్ని నమ్మే పరిస్థితి లేదు, బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదన్నారు.రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో దేవరకద్ర నియోజకవర్గంలో గెలిచి, రెండో సారి దేవరకద్ర గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో 14 కు 14 సీట్లను కైవసం చేసుకుంటాం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండోసారి అధికారంలోకి వస్తామన్నారు. 2034 వరకు ఇక్కడ అధికారంలో ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఎమ్మెల్యే జిఎంఆర్ ధీమా వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక సందర్భంగా శుక్రవారం ఏర్పాట్లను దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పరిశీలించారు. ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తకోటకు వస్తున్నారు. ఈ సందర్భంగా ఆరోజు చేపట్టాల్సిన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రారంభించనున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశీలించారు. ఆరోజు చేపట్టాల్సిన ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మైనార్టీ నాయకుడికి ఎమ్మెల్యే జిఎంఆర్ పరామర్శ



జయభేరి, దేవరకద్ర :

మహబూ బ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం లాల్ కోట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మోయిన్ ను శుక్రవారం దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పరామర్శించారు.గత కొన్ని రోజుల క్రితం మోయిన్ అపెండెక్స్ ఆపరేషన్ చేసుకున్నారు.దీంతో ఎమ్మెల్యే జిఎంఆర్ ఆబ్ కైసే హై..మోయిన్ బై అంటూ ఆప్యాయంగా పలకరించారు. ఆరోగ్యానికి సంబంధించిన అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడికి ఘన సన్మానం




జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటేష్ యాదవ్ ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి పూలమాలలువేసి ఆయనకు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాలుకోట మైనార్టీ నాయకుడు మోయిన్, జానకిరామ్, ఆత్మ లింగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నచింతకుంట మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, ప్రజలకు మరింత చేరువై సేవా కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని వెంకటేష్ యాదవ్ వారు కోరారు. ఈ కార్యక్రమంలో బండర్ పల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు తిరుపతయ్య, వడ్డేమాన్ గ్రామ అధ్యక్షుడు అమరేష్, గౌస్, చిత్తనూరు అంజన్న, నారాయణ ప్రిన్స్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వాసవి మాత పల్లకి సేవ

- అలంకరణలో దర్శనం ఇచ్చిన అమ్మవారు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకి సేవ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే దేవస్థానం ప్రధాన అర్చకుడు హరిశంకర శర్మ ఆధ్వర్యంలో ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవాలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు, భక్తుల హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. నీతో వాసవి మాత అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కల్వ కన్నయ్య శెట్టి, మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి, జిల్లా మాజీ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్య, దోమ హరికాంత్ లతోపాటు స్థానిక ఆర్యవైశ్యులు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ అంశంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం

జయభేరి, పరవాడ:

మహిళలపై నేరాల నివారణ, మహిళా భద్రత, సైబర్ అవగాహన కల్పించేందుకు పరవాడ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నేడు క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది బాలిక విద్యార్థినులు పాల్గొన్నారు. పరవాడ పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా సబ్‌ఇన్‌స్పెక్టర్ జి.ఎస్.వి. మహాలక్ష్మి విద్యార్థినులకు మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలు, లైంగిక వేధింపులు, బాలికల భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, చట్టపరమైన రక్షణలు మరియు మహిళల కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి వివరించారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112, మహిళల సహాయానికి 181 మహిళా హెల్ప్‌లైన్, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు ఆసక్తిగా కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని అభినందించి, బాలికలలో చట్టాలపై మరియు భద్రతపై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

## హామీ లేకుండానే పరవాడ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌లో ఎడ్యుకేషన్ లోన్స్

- బాలికలకు ప్రత్యేక వడ్డీ రాయితీ
- తక్కువ వడ్డీకే విద్యా రుణాలను అందిస్తున్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర




జయభేరి, పరవాడ:

ఉన్నత చదువులు చదవాలనుకునే విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులను దూరం చేస్తూ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర పరవాడ శాఖ ప్రత్యేకంగా మహా బ్యాంక్ ఎడ్యుకేషన్ లోన్ పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. దేశీయంగా, విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈ సులభతర విద్యా రుణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని పరవాడ బ్రాంచ్ మేనేజర్ పి. వి. కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యపై చేసే పెట్టుబడి జీవితానికి శాశ్వత సంపద. డబ్బు కొరత కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు ఆగకూడదనేదే మా లక్ష్యం. విద్యార్థుల కలలను నిజం చేసేందుకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర పరవాడ బ్రాంచ్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది అని ఈ సందర్భంగా పరవాడ బ్రాంచ్ మేనేజర్ పి. వి. కమలాకర్ తెలియజేసారు. మరిన్ని వివరాల కోసం మహా బ్యాంక్ ఎడ్యుకేషన్ లోన్ గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి, దరఖాస్తు చేసుకోవడానికి పరవాడ బ్రాంచ్ మేనేజర్ పి. వి. కమలాకర్ ని 8332996632 మొబైల్ నంబర్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం

- పిడిఎస్ యు జిల్లా ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్

జయభేరి, దేవరకద్ర :




వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ ను దేవరకద్ర మండల కేంద్రంలో శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు హర్షవర్ధన్ మాట్లాడుతూ రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించాలనే ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని, విద్యాశాఖకు మంత్రిని కేటాయించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుందని , మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి అక్షయపాత్ర , ఇస్కమ్, మన్నా, సంస్థలను కాకుండా మహిళా సంఘాలకు కేటాయించాలన్నారు. ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ ,డిఈఓ , లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఎన్నికల మేనిఫెస్టోలో విద్య రంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా విద్య రంగాన్ని మొత్తం భ్రష్టు పట్టిస్తుందని ఆయన ఆరోపించారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు . విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించకుండా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని లేకపోతే భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నరేష్, నందిని,నాని, శివకుమార్,రాధ,అఖిలతదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట పీఏసీఎస్‌లో రైతుల సభ్యత్వాలు ఇంకా పెంచాలి

- పీఏసీఎస్ నూతన పాలకమండలి ప్రమాణస్వీకారంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

జయభేరి, యాదగిరిగుట్ట:



గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రుణమాఫీ చేసి, ప్రజా రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని,ప్రజాపాలనలో రైతులకు పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విమర్శించారు. శుక్రవారం జరిగిన యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్,డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణం చేయించి సన్మానించారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ రైతుల కోసం రూ.2 లక్షల 85 వేల కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే రూ.లక్షా 65 వేల 774 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. పీఏసీఎస్ బ్యాంక్ సేవలు విస్తరించాలని, తెలంగాణ రాష్ట్రంలోనే యాదగిరిగుట్ట పీఏసీఎస్ ముందంజలో ఉండాలన్నారు. పిఏసిఎస్ చైర్మన్, డైరెక్టర్లు సమిష్టిగా పనిచేసి రైతుల కోసం కృషి చేయాలని, రైతులకు యూరియా, డీఏపీ బస్తాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

పీఏసీఎస్‌లో రైతుల సభ్యత్వాలు ఇంకా పెంచాలని ఆయన సూచించారు. పీఏసీఎస్ మోడల్ బ్యాంక్‌గా తీర్చిదిద్దుతామని, రైతులకు అవసరమైన రుణాలు ఇస్తామని తెలిపారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ చీర శ్రీశైలం మాట్లాడుతూ నేను రైతు బిడ్డనేని, ప్రజలు, రైతులు,బీర్ల అయిలయ్య ఆశీర్వాదంతోనే ఈ స్థాయిలో ఉన్నానని అన్నారు. ప్రాథమిక సంఘాన్ని అభివృద్ధి బాటలో తీసుకొస్తానని, రైతులకు ఏ సమస్య వచ్చినా నేను అండగా ఉంటానని తెలిపారు. అంతకు ముందు చైర్మన్‌గా చీర శ్రీశైలం, డైరెక్టర్లుగా శారాజీ వెంకటేష్, గజం లక్ష్మీ నర్సయ్య, సుదుగు బాల్‌రెడ్డి, ఎడ్ల రాంరెడ్డి, తిరుమాని అయిలయ్య, ధీరావత్ నర్సింహ్మా, ఇండ్ల వెంకటేష్, గుజ్జుల రుక్కమ్మ, నువ్వుల రమేష్, బొజ్జ శ్రీను, జాలిగం అండమ్మ, నమిలె లింగం ప్రమాణస్వీకారం చేయగా, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు వారిని శాలువాలతో సన్మానించారు.

## యాదగిరిగుట్టలో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చేస్తాం

జయభేరి, యాదగిరిగుట్ట :




యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో మూడో సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొత్తం 13 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలో అవసరమున్న దగ్గర డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య సమస్యలు, రోడ్డు ఆక్రమణల తొలగింపు, కోతులు, కుక్కల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. యాదగిరిగుట్టలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూస్తున్నామన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ,మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

యాదగిరిగుట్ట పట్టణంలోని తాగునీటితో పాటు ఇతర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బరిగె రమ్య, మున్సిపల్ కమిషనర్ బర్ల శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు బోడ రాధ, బూడిద మధు, కాటబత్తిని స్వప్న, బిట్టు సరోజ,కర్రె మాధవి, పెలిమెల్లి లావణ్య, పేరబోయిన సత్యనారాయణ, సాధునేని ధనలక్ష్మి, ముక్కెర్ల మల్లేష్, బబ్బూరి శ్రీధర్, కోఆప్షన్ సభ్యులు ఉస్మాన్ షరీఫ్, గౌలీకార్ అరుణ, రహీమా, బండి జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పిఏసిఎస్ సభ్యుల ప్రమాణస్వీకారంలో ప్రభుత్వ విప్

- పిఏసిఎస్ చైర్మన్ గా ధనావత్ శంకర్ నాయక్

**జయభేరి, తుర్కపల్లి, జూలై 10 :**



రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై నూతన నియమితులైన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. తుర్కపల్లి మండల కేంద్రం నుండి పిఏసిఎస్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గానికి రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తుర్కపల్లి పిఏసిఎస్ చైర్మన్ గా ధనావత్ శంకర్ నాయక్ తో పాటు నూతన పాలకవర్గ సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు రైతుల ఆర్థిక అభివృద్ధికి కీలకమైన సంస్థలని అన్నారు. రైతులకు అవసరమైన రుణాలు ఎరువులు, విత్తనాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించి సంఘాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని అన్నారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు. రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ సోమల వెంకటేశం, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు తుమ్మల మమతా తిరుపతిరెడ్డి, సర్పంచులు భూక్యరాజారాం నాయక్, ధరావత్ రమేష్ నాయక్, బానోతు బులి వీరన్న నాయక్, కర్రె మాధవి కరుణాకర్ గౌడ్, జేరుపోతుల కరుణాకర్, దొనికేని రేణుక వెంకటేష్ యాదవ్, తునికి లక్ష్మీ రామ్ రెడ్డి, బొత్త రాములు, సోన్నాయిల రఘు, కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్లు మోత్కుపల్లి రవి, బానోతు వినోద్, జాగిల్లపురం సతీష్, గుగులోతు హనుమంతు నాయక్, పనగట్ల సుదర్శన్ గౌడ్, ఒగ్గు బిక్షపతి, వంగ నారాయణరెడ్డి, సదల లత, సింగం శ్రీనివాస్, రామగిరి మహేష్ కుమార్, సిద్ధంకి లక్ష్మి, పాముల రాజు, పిఏసిఎస్ సీఈఓలు నారా రమేష్, బోరెడ్డి జనార్ధన్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- తాపస్ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు
- టి పియుఎస్ మండల అధ్యక్షుడు బండా శ్రీనివాస్ రెడ్డి

**జయభేరి, దంతాలపల్లి, జూలై 10 :**

మండలంలో వివిధ పాఠశాలలలో సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో నమోదు సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు 51 శాతం పిఆర్సి నీ వెంటనే ప్రకటించాలని, పెండింగ్ లో ఉన్నటువంటి ఆరు డి ఏ లను వెంటనే విడుదల చేయాలని, మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా సి పి ఎస్ ను వెంటనే రద్దు చేసి, ఓ పి ఎస్ ను అమలు చేయాలని, విద్యా శాఖలో వెంటనే 190 జీవోను అమలుపరచాలని, కేజీబీవీ, ఎస్ ఎస్ఎ ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనాన్ని అందించి మినిమం టైం స్కేల్ ను అమలు చేయాలని పెండింగ్ బిల్లులు అన్నింటిని వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల హెల్త్ కార్డ్ ల విషయంలో పారదర్శకత పాటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే దశల వారి ఉద్యమంలో భాగంగా జులై 14 న జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నా కు పెద్ద ఎత్తున ఉపాధ్యాయుల పాల్గొనాలి కోరారు కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మహేందర్, సంఘ బాధ్యులు హరిబాబు టి పి యు ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగిరెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ కులాల సమస్యల సాధనకు ఐక్యంగా పోరాడుదాం


- ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులను కఠినంగా అమలు చేయాలి.
- ఎస్సీ జన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయేందర్,
- రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్




**జయభేరి, తొర్రూర్, జులై 10 :**

రాజ్యాంగం దళితులకు ఇచ్చిన హక్కులు పరిరక్షణ కై దళితులు ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ ఎస్సీ జన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయేందర్, రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్ కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవం, హక్కులు, సమానత్వం, న్యాయం కోసం జరిగే ఉద్యమాలలో దళిత బిడ్డలంతా భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. దళితులపై జరుగుతున్న దాడులు అన్యాయాలను అరికట్టాలని, దళితులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు, భూమిలేని నిరుపేదలకు సాగు భూమిని ఇంటి స్థలాలను అందజేయాలి, ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లను అమలు చేయాలి, దళిత విద్యార్థులకు స్కాలర్షిప్ అందించాలని ప్రభుత్వాన్ని వారు కోరారు, దళిత విద్యార్థులకు యువతకు ప్రభుత్వ ఉపాధి ఉద్యోగ అవకాశాలను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, కులవివక్షత నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేయాలని వారు కోరారు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వచ్చే నిధులను దుర్వినియోగం కాకుండా దళితుల సంక్షేమనికి కేటాయించాలని అన్నార. ఈ కార్యక్రమంలో ఎస్సీ జన సంఘం నాయకులు రమేష్, వెంకన్న, వీరస్వామి, శివశంకర్, ఉపేందర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం విజయవంతం చేయాలి



**జయభేరి, తుర్కపల్లి, జూలై 10 :**

ఈనెల 13వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ రుచిరా రెడ్డి అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం జరిగే ఈ బృహత్కార కార్యక్రమాన్ని అందరూ సహకరించి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బిక్షమయ్య, ఏపీవో ఎర్ర నారాయణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# దేవరకొండ పట్టణ ప్రజలకు ముఖ్య గమనిక

**జయభేరి, దేవరకొండ :**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం... ప్రస్తుతం మన దేవరకొండ పట్టణంలో 'ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమం' జరుగుతోంది. దీనిలో భాగంగా మీకు అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో ఎలాంటి సందేహాలు ఉన్నా... వాటిని వెంటనే నివృత్తి చేసుకోవడానికి ఒక ప్రత్యేక హెల్ప్ డెస్క్ సిద్ధంగా ఉంది! ప్రదేశం డిండి రోడ్డులోని... టీటీడీ కళ్యాణ మండపం! కావున, పట్టణ ప్రజలందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మీ ఓటరు వివరాలను సరిచూసుకోవాల్సిందిగా మనవి.

# కాంగ్రెస్‌కు దళితులు బుద్ధి చెప్పాలి

- దళితులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అని ప్రశ్నించారు

**జయభేరి, తుర్కపల్లి, జూలై 10 :**




కాంగ్రెస్‌కు దళితులు బుద్ధి చెప్పాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మిరి శెట్టి నరసింహులు అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భువనగిరిలో బిసి విజయభేరి సభను ప్రజలు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అన్నారు. అధికార పార్టీ వారు ఎన్ని అడ్డంకులు చేసినా ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు సభకు వచ్చి విజయవంతం చేశారని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో ఏడు పిఏసిఎస్ చైర్మన్ లను ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ద్వారా ఎన్నుకోవాలి కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దొడ్డిదారి రాజకీయాలు చేసి ఎన్నుకున్నారని అన్నారు. ఒక్క ఎస్సి కి కూడా పిఎసిఎస్ చైర్మన్ పదవి ఇవ్వలేదని అన్నారు. ప్రతి గ్రామంలో 25% ఎస్సీలు ఉన్నారని, ఎస్సీలకు ఒక్క చైర్మన్ పదవి ఇవ్వకుండా వారిని అగౌరపరిచారని అన్నారు. మూడు ఓసీలు, మూడు బీసీలు, ఒకటి ఎస్టీలకు ఇచ్చి ఎస్సీలకు ఇవ్వకుండా దుర్మార్గమైన ఆలోచన చేశారని, అట్టి ఆలోచనలు మానుకోవాలని అన్నారు. 65% గ్రామాల్లో బీసీలు ఉన్నారని మండలంలో మదర్ డైరీ, మార్కెట్ కమిటీ చైర్మన్ నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. రాబోవు కాలంలో బీసీ ల కోసం అనేక పోరాటాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోత్కుపల్లి రఘు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాంగల కిష్టయ్య, మండల రైతు విభాగం అధ్యక్షుడు గుండెబోయిన కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు గోనె కృష్ణ, మండల యూత్ కార్యదర్శి రావుల రాజు, మాజీ సర్పంచ్ బోళ్ల ప్రకాష్ పాల్గొన్నారు.

# నేడు యాదాద్రి ధర్మకర్తల మండలి కొలువు

- ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దర్శనాలు బంద్

**జయభేరి, యాదగిరిగుట్ట :**



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం స్వయం ప్రతిపత్తితో ఏర్పడిన ధర్మకర్తల మండలి నేడు కొలువుదీరనుంది. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మికతను పెంచేందుకు టీటీడీ తరహాలో అభివృద్ధి చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్‌తో సహా 11 మంది ధర్మకర్తల మండలి, ఏడుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులతో మొత్తం 18 మందిని ప్రకటించారు. ప్రమాణస్వీకారం నిమిత్తం శనివారం ఉదయం 11.37 నిమిషాలకు ప్రధానాలయంలోని బంగారు వాకిలి దగ్గర పాలకమండలి సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. పాలకమండలి ప్రమాణస్వీకారం సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రైవేట్ వాహనాలను అనుమతించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు యాదగిరిగుట్ట ఈవో ఆలయ భవానీ శంకర్ తెలిపారు. యాదగిరిగుట్ట ఆలయంలో నిత్య దర్శనాలు, కల్యాణ సమయాన్ని మార్పు చేశారు. బ్రేక్ దర్శనాన్ని 9 గంటల నుంచి 9.30 వరకు కల్పించనున్నట్లు తెలిపారు. నిత్యకల్యాణం ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు మార్పు చేసినట్లు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం రాష్ట్రపతి భవన్‌లో తొలి సమావేశం కానున్నారు. అనంతరం పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

**ముస్తాబవుతున్న ఆలయం...**

ధర్మ కర్తల పాలకమండలి ప్రమాణ స్వీకారం సందర్భంగా ప్రధానాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

# బెల్ట్‌షాపులు, గంజాయిని అరికట్టాలి

- సీపీఐ కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్

**జయభేరి, యాదగిరిగుట్ట :**




యాదగిరిగుట్ట పట్టణంలోని గంజాయి, బెల్ట్‌షాపులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు బండి జంగమ్మ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. శుక్రవారం యాదగిరిగుట్ట మున్సిపల్ మూడో సాధారణ సమావేశంలో మూడు అంశాలను ఎజెండా పెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదగిరిగుట్ట పట్టణంలో గంజాయి, బెల్ట్‌షాపులతో విద్యార్థులు, యువత తమ జీవితాలను కోల్పోతున్నారని, కుటుంబాలు ఆర్థికంగా ఛిద్రమవుతున్నాయని తెలిపారు. మున్సిపల్ అధికారులు, చైర్మన్, పోలీస్, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో గంజాయి, బెల్ట్‌షాపుల నిర్మూలనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే యాదగిరిగుట్ట పట్టణంలోని ఎటువంటి అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు పెట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, మెయిన్ రోడ్డు పైన దుకాణదారులు తమ కేటాయించిన షాపు హద్దులు కాకుండా పూర్తిగా బిటి రోడ్డుపై వరకు ఏర్పాటు చేస్తున్నారని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, తక్షణమే మున్సిపల్ కమిషనర్, పోలీసులు స్పందించి వీటన్నిటికీ హద్దులు కేటాయించాలని డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డులో స్థానికులకు అవకాశం కల్పించకపోవడం సరైన కాదని, కనీసం ఇక్కడ ప్రజలను నుండి ఎన్నికైన ఆలేరు ఎమ్మెల్యేకైనా అవకాశం కల్పించాలని కోరారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి రావాల్సిన 30% గ్రాండ్, ఇతర అభివృద్ధి కార్యక్రమాల విషయంలో కూడా బోర్డు కమిటీలో చర్చించడం కోసం స్థానికులకు అవకాశం కల్పించాలని కోరారు. సీపీఐ తీర్మానాన్ని కౌన్సిల్ సమావేశం ఆమోదించగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

# కవితకు మీడియా పిచ్చి ఎక్కువైంది

**జయభేరి, హైదరాబాద్ ;**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కవిత తీవ్ర నిరాశ, నిస్పృహలతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

కేవలం టీవీల్లో, మీడియాలో కనిపించాలనే పిచ్చితోనే ఆమె ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఎంతో మంది యువకులు, ఉద్యమకారులు ప్రాణాలు కోల్పోవడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని గండ్ర గుర్తుచేశారు. నాడు, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను ప్రశ్నించకుండా కవిత కేవలం బీఆర్ఎస్ పార్టీని మాత్రమే టార్గెట్ చేయడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని నిలదీశారు. అమరుల కుటుంబాలకు కాంగ్రెస్ సర్కార్ నుంచి న్యాయం జరగాలని ఆమె ఎందుకు గళం విప్పడం లేదని ఆక్షేపించారు. కాంగ్రెస్ వైఫల్యాలను వదిలేసి, బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు గుప్పించడం చూస్తుంటే కాంగ్రెస్, తెలంగాణ రక్షణ సేనల మధ్య ఏదో రహస్య మిత్రత్వం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయని గండ్ర సంచలన ఆరోపణలు చేశారు. అధికార పార్టీతో లోపాయకారి ఒప్పందం కుదుర్చుకుని కవిత ఇలా ఏకపక్షంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.




# రామ్ కీ ఫార్మా సిటీలో భారీగా గంజాయి దగ్ధం

**జయభేరి, పరవాడ:**

మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో నిసీబీ మరియు ఈగల్ వింగ్ సంయుక్తంగా భారీ స్థాయిలో గంజాయి నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆరు వేర్వేరు కేసుల్లో ఎన్సిబి స్వాధీనం చేసుకున్న సుమారు 767.5 కిలోల గంజాయిని మరియు హసీష్ ఆయిల్ 4.036 లీటర ల ను శుక్రవారం నాడు శాస్త్రీయ పద్ధతిలో దగ్ధం చేశారు. పరవాడ మండలం, తానం గ్రామంలోని రామ్ కీ ఫార్మా కంపెనీలో ఉన్న అత్యాధునిక ఇన్సినరేషన్ ప్లాంట్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈగల్ ఎస్పీ G. స్వరూప రాణి మరియు నిసీబీ జోనల్ డైరెక్టర్ m పంకజ్ కుమార్ ద్వివేది, సూపరింటెండెంట్ రాజన్ కుమార్, కె. కిరణ్ బాబు ఇంటెలిజెన్స్ ఆఫీసర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ప్రక్రియ పూర్తయ్యింది. బహిరంగంగా కాల్చకుండా, కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పాటిస్తూ ఇన్సినరేషన్ మెషీన్ ద్వారా గంజాయిని నిర్వీర్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత అధికారులతో పాటు ఈగల్ విభాగం ఇన్‌స్పెక్టర్లు జి . దేముళ్ళు, డాక్టర్ కల్యాణి, మరియు అనకాపల్లి ఈగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, యువతను వ్యసనాల బారి నుండి కాపాడేందుకు ఇటువంటి తనిఖీలు మరియు నిర్మూలన చర్యలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. పట్టుబడిన మత్తు పదార్థాలను ఎప్పటికప్పుడు కోర్టు అనుమతితో ఇలాగే ధ్వంసం చేస్తామని పేర్కొన్నారు.

# ముత్యాలమ్మ పాలెం నూతన సెక్రటరీ భారతిని మర్యాద పూర్వకంగా కలిసిన జనసేన నేత అర్జిల్లి



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయతీ సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించిన భారతిని జనసేన పార్టీ నాయకుడు అర్జిల్లి అప్పలరాజు, ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయతీ జనసేన పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. సెక్రెటరీగా భారతి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అర్జిల్లి అప్పలరాజు మాట్లాడుతూ.. పంచాయతీలో ఉన్న పలు సమస్యలను ఆమె దృష్టికి, తీసుకొని వెళ్లగా, దానికి ఆమె సానుకూలంగా స్పందించింది సమస్యల అన్నింటినీ పరిష్కరిస్తారని హామీ ఇవ్వడం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో సీనియర్ జన సైనికులు బొంది దుర్గారావు, చింతకాయల ముత్యాలు పాల్గొన్నారు.

# ఐమాక్స్ లైట్ ను ప్రారంభించిన బిఆర్ఎస్ నాయకులు

**జయభేరి, పీ ఏ పల్లి :**

పీఏ పల్లి మండలం పుట్టంగండి గ్రామపంచాయతీలో BRS పార్టీ మాజీ గ్రామ శాఖ ఆదేశానుసారం పుట్టంగండి లో BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వి రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఐమాక్స్ లైట్ ను తన సొంత నిధులతో ఐమాక్స్ లైట్ ను నిర్మించి ప్రారంభించడం జరిగినది. బి ఆర్ ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో వి రమేష్ నాయక్ ను అభినందించి శాలువాలతో సన్మానం చేసినారు. ఈ కార్యక్రమంలో పుట్టంగండి బి ఆర్ ఎస్ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# వర్షాకాలంలో బట్టల దుర్వాసనతో ఇబ్బందా?

**వర్షాకాలంలో దుస్తులు త్వరగా ఆరకపోవడం, వాటి నుంచి దుర్వాసన రావడం చాలా సాధారణం. తేమతో కూడిన వాతావరణం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. అయితే, కొన్ని సులభమైన చిట్కాలను పాటిస్తే, ఈ దుర్వాసనను సులభంగా దూరం చేసుకోవచ్చు. వర్షాకాలం వచ్చిందంటే చాలు, వాతావరణం చల్లగా, తేమగా మారుతుంది. ఈ సమయంలో దుస్తులు ఆరడానికి చాలా సమయం పడుతుంది.**

మూడు, నాలుగు రోజులు గడిచినా బట్టలు తడిగా ఉండిపోవడం, వాటి నుంచి చెడు వాసన రావడం చాలామందికి ఎదురయ్యే సమస్య. ఎంత పెర్ఫ్యూమ్ కొట్టినా ఆ వాసన వదలదు, ఫలితంగా ఆ దుస్తులు ధరించడం కష్టంగా మారుతుంది.

### 1. నిమ్మరసంతో దుర్వాసనకు చెక్:

మీరు దుస్తులు ఉతికేటప్పుడు వాడే సర్ఫ్‌లో (డిటర్జెంట్‌లో) కొద్దిగా నిమ్మరసం కలపడం వల్ల దుర్వాసన రాకుండా ఉంటుంది. నిమ్మ రసంలో ఉండే విటమిన్ సి వాసనను తొలగించడమే కాకుండా, దుర్వాసనకు కారణమయ్యే బ్యాక్టీరియాను కూడా చంపుతుంది. ఇది దుస్తులకు సహజమైన సువాసనను అందిస్తుంది.

### 2. బేకింగ్ సోడా:

దుస్తులు ఉతికే డిటర్జెంట్‌లో బేకింగ్ సోడా కలపడం వల్ల కూడా మంచి ప్రయోజనాలు కలుగుతాయి. బేకింగ్ సోడా ఒక అద్భుత మైన వాసన నివారిణి. ఇది దుస్తులలోని చెడు వాసనలను గ్రహించి తొలగిస్తుంది. అలాగే, ఉతికిన తర్వాత దుస్తులకు మంచి సువాసన కోసం కంఫర్ట్ వంటి ఫ్యాబ్రిక్ సాఫ్టెనర్‌లను ఉపయోగించడం వల్ల కూడా మంచి ఫలితాలు ఉంటాయి.

### 3. కర్పూరం బిళ్ళతో సువాసన:

వర్షాకాలంలో దుస్తుల నుంచి దుర్వాసనను పోగొట్టడానికి కర్పూరం బిళ్ళలు కూడా చాలా ఉపయోగపడతాయి. దుస్తులు ఆరిన తర్వాత లేదా వాటిని అలమరాలో భద్రపరిచేటప్పుడు, కొన్ని కర్పూరం బిళ్ళలను దుస్తుల మధ్య ఉంచండి. కర్పూరం సహజంగా సువాసనను వెదజల్లి, దుస్తులకు తాజాగా ఉండేలా చేస్తుంది. ఇది తేమను కూడా కొంతవరకు గ్రహిస్తుంది.

### 4. వాషింగ్ మెషిన్, డ్రైయర్ వాడకం:

ఈ రోజుల్లో చాలామంది వాషింగ్ మెషిన్, డ్రైయర్లను ఉపయోగిస్తు న్నారు. ఇవి దుస్తులను త్వరగా ఆరబెట్టడంలో సహాయపడతాయి. అయితే, కొన్నిసార్లు డ్రైయర్ వాడినా కూడా తేమ వల్ల దుర్వాసన రావొచ్చు. పైన చెప్పిన చిట్కాలు వాషింగ్ మెషిన్‌లో ఉతికిన దు స్తులకు కూడా వర్తిస్తాయి. డ్రైయర్‌లో ఆరబెట్టిన తర్వాత కూడా తేలికపాటి దుర్వాసన అనిపిస్తే, ఈ నిమ్మరసం, బేకింగ్ సోడా లేదా కర్పూరం చిట్కాలను పాటించవచ్చు. ఈ చిన్న చిన్న చిట్కాలను పాటించడం ద్వారా వర్షాకాలంలో మీ దుస్తులు తాజాగా, సువాస నభరితంగా ఉండేలా చూసుకోవచ్చు.



# పండ్లను కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

**పండ్లు మన ఆరోగ్యానికి ఎంత మంచివో మనందరికీ తెలుసు. డాక్టర్లు సైతం ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని చెబుతారు. కానీ చాలా మంది పండ్లను కోసి కొన్ని గంటల తర్వాత తింటారు. అయితే కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే అది మన శరీరం పై చెడు ప్రభావాన్ని చూపుతుంది.**


పండ్లు మన శరీరానికి మంచివని అందరికీ తెలుసు. ప్రతిరోజ పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది. విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెం ట్లు, ఫైబర్ వంటివి పండ్లలో సమృద్ధిగా ఉంటాయి. పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తారు. కొన్నిసార్లు మనం పండ్లను కోసి అలాగే ఉంచుతాం. ఆఫీసులు, ఏదైన ప్రయాణ సమయా ల్లో కోసి తీసుకెళ్తుంటారు. కొంతమంది కోసి ఫ్రిజ్‌లో పెడతారు. కొన్ని గంటల తర్వాత వాటిని తింటారు. కానీ కోసిన పండ్లను ఎంతసేపట్లో తినాలి..? అవి ఎంతకాలం మంచిగా ఉంటాయి అనేది చాలా మందికి తెలియదు. ఇవి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

### పండ్లు తినడానికి సరైన సమయం ఏమిటి?

పండ్లను ఏ సమయంలో తిన్న మంచిదేనని నిపుణులు అంటున్నా రు. అయితే కొన్నింటిని ఉదయం ఖాళీ కడుపుతో, మరికొన్నింటి ని రాత్రి వేళలో తినకూడదని చెబుతారు. ఏదైనా సరే మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు.

### కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

కోసిన వెంటనే పండ్లు చెడిపోవు. కానీ వాటిని ఎంత త్వరగా తింటే అంత మంచిది. నిజానికి కోసిన పండ్లలో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరు గుతుంది. వేసవి, వర్షాకాలం సూక్ష్మజీవుల పెరుగుదలకు ఉత్తమ సమయాలు. ఈ సీజన్లలో కోసిన పండ్ల వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఎక్కువసేపు నిల్వ చేయకుండా వీలైనంత త్వరగా వాటిని తినాలి. పండ్ల నుండి అన్ని పోషకాలను పొందడానికి వాటిని కోసిన అరగంటలోపు తినడం ఎల్లప్పుడూ మంచిదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.



# మహిళలు.. ఈ వ్యాయామాలతో పీరియడ్స్ నొప్పి దూరం..

**ఋతుక్రమ నొప్పి నుండి ఉపశమనం పొందడానికి సున్నితమైన వ్యాయామం గొప్ప మార్గం. కొన్ని ప్రభావవంతమైన వ్యాయామాలలో పెల్విక్ టిల్ట్‌లు, నడుము, గ్లూట్ స్ట్రెచింగ్‌లు, పిల్లల భంగిమ వంటి యోగా భంగిమలు ఉన్నాయి. నడక, ఈత, తేలికపాటి కార్డియో కూడా రక్త ప్రసరణను మెరుగుపరచడం, సహజ నొప్పి నివారణ మందులుగా పనిచేసే ఎండార్ఫిన్‌లను విడుదల చేయడం ద్వారా సహాయపడతాయి.**

### పెల్విక్ టిల్ట్స్ :

మీ మోకాళ్లను వంచి, పాదాలను నేలపై ఉంచి మీ వీపు మీద పడుకోండి. మీ పొత్తికడుపు కండరాలను నిమగ్నం చేస్తూ, మీ పెల్విస్‌ను మెల్లగా పైకి వంచండి. కొన్ని సెకన్ల పాటు అలాగే ఉండి, ఆపై విశ్రాంతి తీసుకోండి. దీన్ని 1015 సార్లు పునరావృతం చేయండి. ఇలా చేస్తే ఋతుక్రమ నొప్పి నుంచి బయటపవచ్చు.

### నడుము కింది భాగం, గ్లూట్ స్ట్రెచ్:

మీ కుడి పాదాన్ని ముందుకు, ఎడమ పాదాన్ని వెనుకకు ఉంచి, మడమను పైకి లేపి ప్రారంభించండి. మీ ముందు మోకాలిని వంచి, మీ చేతులను తలపైకి చాచండి. సాగదీసేటప్పుడు మీ తుంటిని కుడి వైపుకు బయటికి కదిలించండి. దీనివల్ల పీరియడ్ పెయిన్ దూరం అవుతుంది.

### పిల్లల భంగిమ:

నేలపై మోకరిల్లి మీ మడమల మీద తిరిగి కూర్చోండి. ముందుకు వంగి, మీ మొండెంను మీ తొడల మధ్య ఉంచండి. మీ చేతులను ముందుకు చాచండి లేదా వాటిని మీ వైపులా విశ్రాంతి తీసుకోండి. ఈ భంగిమను కొన్ని నిమిషాలు పట్టుకోండి. ఈ భంగిమ ద్వారా ఋతుక్రమ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

### ఇతర ఉపయోగకరమైన వ్యాయామాలు:

సున్నితమైన యోగా భంగిమలు కండరాలను సడలించడానికి మరియు ఉద్రిక్తతను తగ్గించడానికి సహాయపడతాయి. చురుకైన నడక రక్త ప్రస రణను మెరుగుపరుస్తుంది మరియు నొప్పిని తగ్గిస్తుంది. నీటిలో ఈత సామర్థ్యం మద్దతు, సున్నితమైన వ్యాయామాన్ని అందిస్తుంది. కొన్ని పైలేట్స్ వ్యాయామాలు కోర్ కండరాలను బలోపేతం చేస్తాయి మరియు భంగిమను మెరుగుపరుస్తాయి.

### ముఖ్యమైన విషయాలు:

ఏదైనా వ్యాయామం నొప్పిని కలిగిస్తే, ఆగి విశ్రాంతి తీసుకోండి. భారీ వ్యాయామాలు కొన్నిసార్లు తిమ్మిరిని మరింత తీవ్రతరం చేస్తాయి. పుష్క లంగా నీరు త్రాగడం వల్ల కండరాల తిమ్మిరిని నివారించవచ్చు. హీటింగ్ ప్యాడ్ వేయడం లేదా వెచ్చని స్నానం చేయడం కూడా ఉపశమనం కలి గిస్తుంది.





## గాయపడినా రాశీ ఖన్నా..


టాలీవుడ్, బాలీవుడ్‌లో తనదైన గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ రాశీ ఖన్నా షూటింగ్ సందర్భంగా గాయపడిన విషయం అభిమానుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్, నటి విద్యా బాలన్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అనీస్ బజ్మీ తెరకెక్కిస్తున్న భారీ కామెడీ ఎంటర్‌టైనర్‌లో రాశీ ఖన్నా కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ప్రమాదంలో ఆమె గాయపడినప్పటికీ, ధైర్యంగా షూటింగ్ పూర్తి చేయడం విశేషంగా మారింది. తాజాగా ఈ విషయాన్ని రాశీ ఖన్నా స్వయంగా సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంది. యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతున్న సమయంలో గాయపడినట్లు తెలిపిన ఆమె, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ షూటింగ్‌ను మధ్యలో నిలిపివేయలేదని వెల్లడించింది. తన సినీ ప్రయాణంలో ఇదే అత్యంత కఠినమైన షూటింగ్ షెడ్యూల్ అని పేర్కొంది. రాశీ ఖన్నా గాయపడిన వార్త తెలిసిన వెంటనే అభిమానులు ఆమె త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, విశ్రాంతి తీసుకుంటూనే మిగిలిన షూటింగ్‌కు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ భారీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. షూటింగ్‌లో ఎదురైన ఇబ్బందులను అధిగమించి తన వృత్తిపట్ల అంకితభావాన్ని చాటుకున్న రాశీ ఖన్నాపై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.




## మళ్లీ పుట్టే ప్రేమ 'శ్రీశ్రీ'

మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్ సినిమాలతో వరుసగా వందకోట్ల విజయాలను తెలుగులో అందుకున్న మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్.. మరో స్ట్రయిట్ ప్రేమకథతో మళ్లీ తెలుగు ప్రేక్షకుల్ని పలకరించబోతున్నారు. ఈ చిత్రం ద్వారా రవి నెలకుదిటి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. పూజా హెగ్డే కథానాయిక. శ్రీలక్ష్మీవెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. శుక్రవారం నిర్మాతలు ఈ సినిమా టైటిల్‌తోపాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ఈ సినిమాకు 'శ్రీశ్రీ' అనే ఆహ్లాదకరమైన టైటిల్‌ని ఖరారు చేశారు. 'లవ్ విల్ స్పార్క్ అగైన్' అనేది ఉపశీర్షిక. కాంపౌండ్ వాల్‌పై కూర్చుని సరదాగా కబుర్లాడుకుంటున్న దుల్కర్ సల్మాన్, పూజాహెగ్డేలను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. బ్లూ షర్ట్, గ్రే ట్రౌజర్, కళ్లద్దాలతో చిరునవ్వులు చిందిస్తూ దుల్కర్ కనిపిస్తే, లైట్ బ్లూ సల్వార్ సూట్‌లో అతని వైపు చూసి మనసారా నవ్వుతూ పూజా హెగ్డే కనిపిస్తున్నది. ఇద్దరూ క్లాస్‌మెట్స్ అని పోస్టర్ చెబుతున్నది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ ప్రేమకథకి కెమెరా: అనయ్ ఓం గోస్వామి, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, సహనిర్మాత: ఇషాన్ సక్సేనా.

## కనకరాజు వచ్చేది ఆరోజే!



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న 'కొరియన్ కనకరాజు' చిత్రాన్ని ఆగస్ట్ 7న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇండియన్‌కొరియన్ కల్చర్ కలబోతగా హారర్ కామెడీతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మాతలు. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా శుక్రవారం కొత్తపోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో వరుణ్‌తేజ్ ఓ చేతిలో కత్తి, మరో చేతిలో గ్రెనేడ్ పట్టుకొని రఫ్ అండ్ అల్ట్రాస్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్నారు. కొరియన్ గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ కథలో వరుణ్‌తేజ్ పాత్ర కొత్త పంథాలో ఉంటుందని మేకర్స్ తెలిపారు. రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, రచన దర్శకత్వం: మేర్లపాక గాంధీ.



## ఒకే ఒక్క సినిమాతో క్రేజ్..

ముద్దుగుమ్మ షాలిని పాండే. అర్జున్ రెడ్డి సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది ఈ చిన్నది. సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో తెరకెక్కిన అర్జున్ రెడ్డి సినిమా సంచలన విజయాన్ని అందుకుంది. ఆతర్వాత కొన్ని ఆఫర్స్ అందుకుంది. కానీ ఆశించిన స్థాయిలో సక్సెస్ సాధించలేకపోయింది. ఈ అమ్మడు నటించిన సినిమాల్లో 118 సినిమా ఆ ఒక్కటి కాస్త పర్లేదు అనిపించుకుంది. మిగిలిన సినిమాలన్నీ ప్రేక్షకులను నిరాశపరిచాయి. ఇక సోషల్ మీడియాలో ఈ చిన్నది చేసే హడావిడి అంతా ఇంతా కాదు. తన అందాలతో కుర్రాళ్లకు గాలాలు వేస్తుంది. అందాలు ఆరబోస్తూ ఫోటోలకు ఫోజులిస్తుంది. అందం , అభినయం ఉన్న ఈ అమ్మడిని అవకాశాలు మాత్రం వరించడం లేదు. ఇక నెట్టింట ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోలకు భారీ డిమాండ్ ఉంటుంది. నెటిజన్స్ ఈ బ్యూటీ ఫోటోల పై క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. షాలిని పాండే తెలుగు, తమిళం, హిందీ సినిమాల్లో నటించి మెప్పించింది. ఈ బ్యూటీ 1993 సెప్టెంబర్ 23న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జన్మించింది. జబల్‌పూర్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేసిన షాలిని, చిన్నప్పటి నుంచి నటనపై ఆసక్తితో సినిమాల్లోకి వచ్చింది. ఇంజనీరింగ్ చదువుతున్న రెండవ సంవత్సరం నుంచే ఆమె నాటకాల్లో నటించడం ప్రారంభించింది. షాలిని పాండే 2017లో విజయ్ దేవరకొండ నటించిన తెలుగు చిత్రం అర్జున్ రెడ్డి ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ఈ చిత్రంలో ఆమె ప్రీతి అనే పాత్రలో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఆతర్వాత తెలుగులో పెద్దగా కనిపించలేదు. తమిళ్ లో ఒకటి రెండు సినిమాలు చేసింది కానీ అవి కూడా పెద్దగా ఆకట్టుకోలేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో అందాలు ఆరాబోస్తుంది ఈ వయ్యారి.

## హీరో నిఖిల్ క్లాప్ తో రోషన్ కనకాల కొత్త చిత్రం ప్రారంభం






కొన్ని సినిమాలు ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్, ప్రేమ, మిస్టరీ కలిసిన అలాంటి కొత్త ప్రపంచాన్ని పరిచయం చేయబోతున్న ఓ భారీ కాన్సెప్ట్ సినిమా ఘనంగా ప్రారంభమైంది. రోషన్ కనకాల, గహజి ప్రధాన పాత్రల్లో సరికొత్త హైకాన్సెప్ట్ సైఫై ఎంటర్‌టైనర్ అధికారికంగా లాంచ్ అయ్యింది. సత్య, సుదర్శన్, రవి తేజ నన్నిమాల ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా విజయ్ కె కామిశెట్టి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రముఖ దర్శకుడు విఐ ఆనంద్ వద్ద చీఫ్ అసోసియేట్ డైరెక్టర్, డైలాగ్ రైటర్‌గా ఎన్నో ఏళ్లుగా పనిచేసిన విజయ్, 'టైగర్', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఒక్క క్షణం', 'డిస్కో రాజా', 'స్వయంభు' వంటి విజయవంతమైన చిత్రాలలో కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ తో ఆయన దర్శకత్వంతో పాటు స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందిస్తున్నారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్ సినిమాల స్థాయిని తన వినూత్న స్టోరీ టెల్లింగ్ తో మార్చిన విఐ ఆనంద్ అందించిన కథ ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. గుత్తా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బాలాజీ గుట్ట, కౌశిక్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ సహకారం అందిస్తోంది. ఆసక్తికరమైన కాన్సెప్ట్, భారీ స్థాయి నిర్మాణంతో ఈ చిత్రం సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందించనుంది. కాకతీయ హిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ఈ రోజు ఘనంగా ప్రారంభమైంది. హీరో నిఖిల్ ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టగా, సినిమాటోగ్రాఫర్ కెకె సెంథిల్ కుమార్ కెమెరాను స్విచ్ ఆన్ చేశారు. విఐ ఆనంద్ స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందజేయడమే కాకుండా, ప్రాజెక్ట్‌కు తన శుభాకాంక్షలు అందిస్తూ ప్రారంభ షాట్‌కు దర్శకత్వం వహించారు. ఫాంటసీ, రొమాన్స్, కామెడీ, మిస్టరీ, అత్యాధునిక సైన్స్ ఫిక్షన్ అంశాల కలయికతో రూపొందుతున్న ఈ చిత్రం, ఊహలు, భావోద్వేగాలు, అద్భుతమైన దృశ్యాలతో కూడిన ఒక కొత్త ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకువెళ్లనుంది. పూర్తి స్థాయి థియేట్రికల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతి మలుపు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుందని, ప్రతి భావోద్వేగం చెరగని ముద్ర వేస్తుందని చిత్ర బృందం హామీ ఇస్తోంది. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించగా, అన్వేష్ వరాల సినిమాటోగ్రఫీని, చోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా, వి.ఐ. ఆనంద్, అనూష వేలుస్వామి క్రియేటివ్ ప్రొడ్యూసర్లుగా, బండి భాస్కర్, శైలేంద్ర కుమార్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లుగా పని చేస్తున్నారు. ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతుండగా, రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. చిత్ర నిర్మాతలు త్వరలోనే టైటిల్, ఫస్ట్ లుక్, అనేక ఆసక్తికరమైన అనౌన్స్మెంట్స్ చేయనున్నారు. తారాగణం: రోషన్ కనకాల, గహజీ, సత్య, సుదర్శన్, రవితేజ నన్నిమల & ఇతరులు

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**